


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 3 సంచిక: 232, పేజీలు - 09

మంగళవారం, నవంబర్ 28, 2023 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## నిలిచిపోయిన రైతుబంధు

### రైతన్న దెబ్బ బీఆర్ఎస్‌కా.? కాంగ్రెస్‌కా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఎన్నికల్లో రైతు బంధు రాజకీయం నడుస్తోంది. ఎన్నికల ప్రచార గడువు ముగియడంతో ఎత్తులకు పైఎత్తులు, వ్యూహాలకు ప్రతివ్యూహాలతో తమ ప్రత్యర్థి పార్టీలకు చెక్ పెట్టేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నారు.

**రైతు బంధు పథకం, పూర్వాపరాలు**

రైతుబంధు పథకాన్ని 2018 మే 10వ తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున ఏడాదికి రెండు వ్యవసాయ సీజన్ లను అనుసరించి ఎకరానికి పది వేల రూపాయలను రైతులకు చెల్లిస్తోంది. రాష్ట్రంలోని 68.99 లక్షల రైతులకు ఈ రైతు బంధు అందుతోంది. ఇప్పటి వరకు 11 విడతలుగా ప్రభుత్వం ఈ రైతు బంధు సాయం అందించింది.

**రైతులే లక్ష్యంగా ఎన్నికల రాజకీయం**

గత ఖరీఫ్ సీజన్ లో రైతు బంధును పంపిణీ చేసిన ప్రభుత్వం యాసంగి సీజన్ కు నవంబర్ లో పంపిణీ చేయాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ ను ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో రైతు బంధు డబ్బులు ఇస్తే బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో లబ్ధి చేకూరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసింది. ఈ కారణంతో ఎన్నికల కమిషన్ రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయవద్దని ఆదేశించింది. దీంతో రైతులకు రైతు బంధు డబ్బులు అందలేదు. ఇది కొత్త స్కీం కాదని, ఆన్ గోయింగ్ స్కీం కనుక రైతు బంధు డబ్బులు రైతులకు అందేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కమిషన్ ను కోరింది. దీంతో ఈ నెల 24వ తేదీన రైతు బంధు అమలు చేయాలని, కాని ఎన్నికల్లో లబ్ధి పొందేలా కామెంట్లు చేయవద్దని ఎన్నికల కమిషన్ షరతు విధించింది. అయితే మంత్రి హరీశ్ రావు ఎన్నికల ప్రచారంలో రైతు బంధు నిధులు వస్తాయంటూ ప్రచారంలో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను జత చేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత నిరంజన్ రెడ్డి ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయడంతో , ఆ అంశాన్ని పరిశీలించిన ఎన్నికల కమిషన్ తాజాగా రైతు బంధును నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పార్టీకి ప్రయోజనం కలిగేలా రైతు బంధు పథకాన్ని ప్రచారంలో వాడుకున్నట్లుగా తేల్చింది. దీంతో రైతు బంధను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రైతుబంధు నిలిపివేత పాపం మీదంటే మీదే అంటున్న పార్టీలు**

రైతు బంధు డబ్బులు రైతులకు చెల్లించకుండా అడ్డుపడింది మీరంటే మీరంటూ అటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటున్నారు. కాంగ్రెస్ ఫిర్యాదు వల్లే రైతు బంధును ఎన్నికల కమిషన్ నిలిపివేసిందని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సహా ఇతర నేతలు కేటీఆర్, హరీశ్ రావు, కవిత, నిరంజన్ రెడ్డి వంటి నేతలు కాంగ్రెస్ టార్గెట్ గా ఎన్నికల్లో ప్రచారం చేస్తుంటే.. దానికి కౌంటర్ గా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సహా హస్తం పార్టీ నేతలంతా తామేమి ఫిర్యాదు

6లో ▶

## నవీన్ పట్నాయక్ వారసుడొచ్చాడు ?

### – బీజేడీలో చేరిన వీకే పాండ్యన్



**భుబనేశ్వర్ (ప్రశ్న న్యూస్)** ఒడిశా రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే వయోభారంతో ఇబ్బంది పడుతున్న సీఎం నవీన్ పట్నాయక్ రాజకీయ వారసుడిగా భావిస్తున్న సెక్రటరీ వీకే పాండ్యన్ అనూహ్యంగా అధికార పార్టీ బీజేడీలో చేరిపోయారు. ఇప్పటికే ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉంటూ వీఆర్ఎస్ తీసుకుని నవీన్ వ్యక్తిగత కార్యదర్శిగా చేరిన పాండ్యన్ నెలల వ్యవధిలోనే బీజేడీలో చేరిపోవడం విశేషం. దీంతో త్వరలో నవీన్ ఆయన్ను తన రాజకీయ వారసుడిగా ప్రకటించే అవకాశముంది. 2000 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన వీకే పాండ్యన్ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, బీజేడీ సీనియర్ నేతల సమక్షంలో పార్టీలో చేరారు. 2011 నుండి 12 సంవత్సరాల పాటు పట్నాయక్ ప్రైవేట్ సెక్రటరీగా ఆయన పనిచేశారు. సమర్థుడైన

6లో ▶

## రాయి ఏదో రత్నమేదో చూసి ఓటెయ్యండి

### - అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేసీఆర్ పిలుపు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాయి ఏదో, రత్నమేదో ప్రజలు గమనించాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్ నగర్, చేవెళ్ల, ఆందోల్ లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో అభ్యర్థుల చరిత్ర, వ్యక్తిత్వం, చేసిన అభివృద్ధిని చూసి పరిణితితో ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. ఓటే మీ భవిష్యత్తని, పని చేసే వారినే ఆశీర్వదించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రజల హక్కులు కాపాడడం కోసం పుట్టిన పార్టీ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కు 11 సార్లు అవకాశం ఇచ్చినా చేసింది ఏమీ లేదని విమర్శించారు. సుదీర్ఘ పోరాటం తర్వాత సాధించుకున్న తెలంగాణలో పదేళ్లలో అభివృద్ధిని చేసి చూపామని నేడు సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే

6లో ▶

## సైలెన్స్ పీరియడ్‌లో బల్క్ ఎస్ఎంఎస్ లపై నిషేధం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈనెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో యాప్పటికే అభ్యర్థులు ప్రచార పర్వంలో తుది ఘట్టాన్ని కొనసాగిస్తున్నారు. ఇక ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం తలపడుతున్నాయి. ఇక ఎన్నికల అధికారులు పోలింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో అన్ని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని చెప్తున్నారు ఎన్నికల అధికారులు. ఇప్పటికే సోషల్ మీడియా ప్రచారంపైన కూడా నిఘా పెట్టిన ఎన్నికల అధికారులు పోలింగ్ కు ముందు 48 గంటల సైలెన్స్ పిరియడ్ లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను

6లో ▶

## నారా లోకేశ్ 'యువగళం' పునఃప్రారంభం

### - మంత్రుల కౌంట్ డౌన్ మొదలైందన్న లోకేశ్, వడ్డీతో సహా చెల్లిస్తామని వ్యాఖ్యలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో మంత్రులకు కౌంట్ డౌన్ మొదలైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. తాను ఏ తప్పూ చేయలేదు కనుకే మళ్లీ ఇక్కడ నిలబడ్డానని పేర్కొన్నారు. 'టీడీపీ అధినేత చంద్రబాబును జైలుకు పంపితే నా పాదయాత్ర ఆగుతుంది అనుకున్నారు. వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర ఆగదు. వ్యవస్థలను మేనేజ్ చేసి 53 రోజులు చంద్రబాబును జైల్లో పెట్టారు. నాపై కూడా సీఐడీ కేసులు పెట్టారు. ఇప్పటి వరకూ 6 కేసులు పెట్టినా ఒక్క ఆధారం లేదు. స్కిల్ కేసులోనూ ఒక్క ఆధారం చూపలేకపోయారు. ఆనాడు పవన్ కల్యాణ్ వస్తుంటే ఎలా అడ్డుకున్నారో చూశాం. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లించే బాధ్యత నేను తీసుకుంటా.' అని లోకేశ్ వ్యాఖ్యానించారు. స్కిల్ కేసులో తమ పార్టీ ఖాతాలోకి డబ్బు వచ్చిందని నిరూపించగలరా.? అంటూ ప్రభుత్వానికి సవాల్

6లో ▶

## హైదరాబాద్‌లో మోడీ మెగా రోడ్ షో

- హుజూరాబాద్, కరీంనగర్ సంకల్ప సభలో ప్రధాని
- హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కేసీఆర్ కు ట్రైలర్ చూపించామన్న మోడీ
- ఈ ఎన్నికల్లో సినిమానే అన్న ప్రధాని
- అమీర్ పేట లోని గురుద్వారాను సందర్శించిన ప్రధాని





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ నగరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ప్రారంభమైన రోడ్ షో నారాయణగూడ, వైఎంసీఏ, కాచిగూడ చౌరస్తాలోని వీర్ సావర్కర్ విగ్రహం వరకు సాగింది. రెండు కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్షోలో ప్రధాని మోడీని చూసేందుకు

6లో ▶

## ప్రజలకు సేవ చేసే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదు

### - ప్రభుత్వంలో మొత్తం అవినీతే అన్న ప్రియాంక గాంధీ వాద్రా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో యువతకు ఉద్యోగాలు కావాలంటే అందరూ కాంగ్రెస్‌కు ఓట్లు గెలిపించాలని ప్రియాంక గాంధీ కోరారు. ఈ ప్రభుత్వం ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడలేదని అన్నారు. నిత్యావసర ధరలు కూడా విపరీతంగా పెరిగాయని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కళ్లు మూసుకుని నిద్రపోతోందని ఎద్దేవా చేశారు. వ్యవసాయం చేసుకోవాలనే రైతులకు రుణాలు ఇవ్వడం లేదని, ఆఖరికి మాట ఇచ్చిన రుణమాఫీ కూడా జరగలేదని ప్రియాంక అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పోలింగ్ జిమ్మిక్కులు చేస్తుందని, తాము అధికార పార్టీకి

6లో ▶

## జగన్ విన్నింగ్ ఫార్ములా.. ఆపరేషన్ అపోజీషన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో ఎన్నికల లెక్కలు మారుతున్నాయి. తెలంగాణ ఫలితాలు వెల్లడి తరువాత ఇక ఏపీలో రాజకీయం వేడెక్కనుంది. ఇప్పటికే టీడీపీ, జనసేన పొత్తు ఖాయమైంది. తెలంగాణలో బీజేపీకి మిత్రపక్షంగా ఎన్నికల బరిలోకి దిగిన పవన్.. ఏపీలో తమ రెండు పార్టీలతో బీజేపీ కలిసి వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నిర్ణయం ఏంటనేది అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఢిల్లీ పరిణామాలపైన స్పష్టతతో ఉన్న జగన్ తన మార్క్ వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు.

**ఏపీలో నయా సమీకరణాలు**

తెలంగాణ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న వెల్లడి కానున్నాయి. తెలంగాణ ఎన్నికల ఫలితాల తరువాత ఏపీలో ఎన్నికల రాజకీయం రాజుకోనుంది. ఏపీలో టీడీపీతో జత కట్టిన పవన్ కల్యాణ్..తెలంగాణలో బీజేపీ తో ముందుకు వెళ్తున్నారు. అక్కడ టీడీపీ పోటీ నుంచి తప్పుకుంది. దీంతో, ఏపీ మూలాలు ఉండి తెలంగాణలో స్థిర పడిన ఓటర్లు బీజేపీ – జనసేనకు మద్దతిస్తారని కమలం పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. కానీ, అక్కడ టీడీపీ మద్దతు దారులు నేరుగా ప్రియాంక ర్యాలీల్లో పార్టీ జెండాలతో హాజరు కావటం ఖమ్మం వంటి జిల్లాల్లో టీడీపీ నేతలు కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించటంతో కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. ఇక, తెలంగాణలో పవన్ ఏ స్థాయిలో సహకరించారనేది కౌంటింగ్ తో స్పష్టం కానుంది.

**ఢిల్లీ నేతల కొత్త లెక్కలు**

ఏపీలో బీజేపీ మద్దతు పొందేందుకే తెలంగాణలో కాషాయం పార్టీకి పవన్ సహకరిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ,ఆ లెక్కే ఏపీలో ఇబ్బంది పెట్టే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ తో పొత్తు విషయంలో చంద్రబాబు, పవన్ సానుకూలంగా ఉన్న టీడీపీలో భిన్నాభిప్రాయాలు

6లో ▶

## బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం నోటీసులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. 'స్కాంగ్రెస్' పేరిట ప్రకటనలు ఇవ్వడంపై బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ చేసిన ఫిర్యాదును పరిశీలించిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు స్పష్టం చేశారు.

**పోస్టల్ బ్యాలెట్‌పై ఈసీ కీలక నిర్ణయం**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పోస్టల్ బ్యాలెట్ అందనివారు సంబంధిత రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలని సూచించింది. ఓటు హక్కు ఉన్న నియోజకవర్గంలో ఆర్వోను కలవాలని సిబ్బందికి తెలిపింది. సిబ్బంది ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ ఆర్వోకు చూపించి పోస్టల్ బ్యాలెట్ తీసుకోవచ్చని పేర్కొంది. అలా పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న సిబ్బంది ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది.

**కర్ణాటక ప్రభుత్వంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్**

కర్ణాటక ప్రభుత్వంపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటక ప్రభుత్వం తెలంగాణలో ప్రకటనలు ఇవ్వడంపై ఈసీ మండిపడింది. ఎన్నికల సమయంలో పక్క రాష్ట్రంలో ప్రకటనలు జారీ చేయడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందికే వస్తుందని ఈసీ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు వివరణ ఇవ్వాలంటూ కర్ణాటక సీఎస్‌కు లేఖ రాసింది. వెంటనే ప్రకటనలు నిలిపివేయాలని ఆదేశించింది. ప్రకటనల జారీపై సంబంధిత సమాచార, ప్రజా సంబంధాల శాఖ కార్యదర్శిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని లేఖలో పేర్కొంది. ఎన్నికల వేళ



తెలంగాణలో ప్రకటనలు ఇవ్వడంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల ఫిర్యాదుల నేపథ్యంలో ఈసీ పై విధంగా స్పందించింది. ప్రకటనల కోసం కర్ణాటక ప్రభుత్వం తమ అనుమతి తీసుకోలేదని ఈసీ

6లో ▶

# మళ్లీ బిఆర్ఎస్ లోకి గ్రామ అధ్యక్షులు. బాంచ వీరేశం.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం గ్రామా భిఆర్ఎస్ అధ్యక్షులు. బాంచ వీరేశం.. కాంగ్రెస్ పార్టీలోకి. బలవంతంగా చేర్పించి కోవడంతో.గ్రామ సీనియర్ నాయకులు. జెడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్. పార్టీ తాము ఎప్పుడు అండగా ఉంటామని చెప్పి. సునీత లక్ష్మారెడ్డి సమక్షంలో. బాంచ వీరేశమును.. పార్టీ కండువా కప్పి. చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు శ్రీధర్ గౌడ్. చందర్ నాయక్ లు మాట్లాడుతూ. తమపార్టీకి చెందిన నాయకులను కార్యకర్తలను. ప్రలోభ పెడితే ఊరుకునేది లేదని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. సునీత లక్ష్మారెడ్డి.. శాసనసభ్యులు మదన్ రెడ్డి. మండలాన్ని నియోజకవర్గాన్ని.. అనేక అభివృద్ధి పనులు చేశారని.. బలవంతం చేస్తూ.. మోసం చేస్తే సహించేది లేదని. వారన్నారు..నర్సాపూర్ గడ్డపై కచ్చితంగా గులాబీ జెండా ఎగరవేస్తామని. ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో. గౌడ సంఘం నాయకులు శేఖర్ గౌడ్. రాజు గోపాల్. రత్నం. నయీమ్ భాష. తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్ల పై నోడల్ , సెక్టార్ అధికారులతో సమావేశం

**జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ రాజర్షి షా**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) సాధారణ ఎన్నికలు 2023,ఎన్నికల నియమావళి లో బాగంగా , ఆదివారం కలెక్టర్ కార్యాలయం లో ని సమావేశ మందిరంలో, ఎన్నికల సరళి పై , ఈ నెల 30 న జరిగే ఎన్నికల ఏర్పాట్లపై నోడల్, సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ , జిల్లా వ్యాప్తంగా 579 పోలింగ్ కేంద్రాలలో మరొక సారి మౌలిక సదుపాయాలను పరిశీలించాలని , ఇంజనీర్లు , సెక్టార్ అధికారులకు , ఎంపిడిఓ లకు , మునిసిపల్ కమిషనార్లను ఆదేశించారు . ఎన్నికల నియమావళి ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల నవంబర్ 28 తేదీ సాయంత్రం 5 వరకు ప్రచారం ముగించాలని అన్నారు . ఎంసీసీ , ఎఫ్ ఎస్ టి టీమ్ లు, రాజకీయ పార్టీలు చేసే ప్రలోభాలు లను పసిగట్టలన్నారు. కమ్యూనిటీ సంఘాల తో భోజనాలు,ధర్మశాల లో ,గెస్ట్ హౌస్ లలో జరిగే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, జిల్లా లో ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్ర వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు . పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఎటువంటి ఎన్నికల ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకులు, అధీకృత ఎన్నికల/పోలీస్ అధికారులకు మినహా, ఇతరులకు పోలింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్లు, వైర్లెస్ సెట్లు అనుమతించరని, పోలింగ్ స్టేషన్ కు వంద మీటర్ల పరిసరాలలో ఉపయోగించరాదని తెలిపారు. జిల్లాలో ఓటు హక్కు లేని , రాజకీయాలకు సంబంధించిన వ్యక్తులు ఈనెల 28 నుండి ఇతర జిల్లా , ఇతర నియోజక వర్గాల వారు , ఎవరు ఉన్న , జిల్లా ను, నియోజక వర్గాన్ని వదిలి వెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్ , డిఆర్ ఓ పద్మశ్రీ , జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు , సెక్టార్ అధికారులు , మునిసిపల్ కమీషనర్లు ,ఎంపిడిఓలు , ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షునిగా ఆంజనేయులు గౌడ్ నియామకం..!!



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ డిసిసి మెదక్ జిల్లా అధ్యక్షునిగా రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ను పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ ఆవిర్భవించాలని ఆంజనేయులు గౌడ్ ఒడిదుడుకులు ఎదుర్కొంటూ నిజమైన కార్యకర్తగా పనిచేస్తున్నందుకు పార్టీ అధిష్టానం డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వడంపై నర్సాపూర్ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అశోక్ గౌడు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో పాత్ర పోషించడంతో పాటు కాంగ్రెస్ పార్టీలో నికాస్ అయిన వ్యక్తిగా తనదైన శైలిలో పార్టీ కోసం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల తరఫున వీర సైనికులుగా పోరాడిన వ్యక్తి రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ను గౌరవించి పదవి నియమించడంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది నాయకులు పార్టీలు మారుతారు కానీ ఆంజనేయులు గౌడ్ కేవలం కాంగ్రెస్ పార్టీ కుటుంబం లాగానే పనిచేస్తూ సైనికునిలా ప్రజల గుండెల్లో చెదరని నాయకునిలా ఉన్నాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆంజనేయులు గౌడ్ పనికి తగ్గ గౌరవం ఇచ్చినందుకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం గౌడ్, మహేష్ గౌడ్, వీరస్వామి గౌడ్, సలీం, నర్సింలు గౌడ్ ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ని గెలిపించండి

**- బెజ్జాల కృష్ణమూర్తి**




తార్నాక(ప్రశ్న న్యూస్) ఆటో రిక్షా డ్రైవర్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ డ్రైవర్స్ ఏఐటియుసి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ కి మద్దతు ఇస్తూ తార్నాక చౌరస్తాలో కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆటో డ్రైవర్ల అందరూ అతికేసంకలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామని ఏఐటియుసి తెలంగాణ స్టేట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బెజ్జాల కృష్ణమూర్తి కోరారు.

# టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శలపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**- నాలుగు పార్టీలు మారి నన్ను విమర్శించడం హాస్యాస్పదం**
**- తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సర్వనాశనం కావడానికి కారణం రేవంత్ రెడ్డి**
**- నేను ఏ పరిస్థితుల్లో పార్టీ మారానో చంద్రబాబు కు తెలుసు**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) పార్టీ మారి, తెలుగుదేశం పార్టీకి ద్రోహం చేసారన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే గాంధీ. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డి నన్ను విమర్శించడం హాస్యాస్పదం. నేను ఏ పరిస్థితుల్లో పార్టీ మారానో చంద్రబాబు నాయుడు కు ప్రజలకూ తెలుసు అని విమర్శించారు. అసలు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సర్వనాశనం కావడానికి కారణం రేవంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తన మీద చేసింది కేవలం ఆరోపణలు మాత్రమే, కానీ రేవంత్ రెడ్డి భాగోతం దేశం అంతా కళ్ళారా టీవీలో చూసింది తనను విమర్శించే నైతిక అర్హత కూడా రేవంత్ రెడ్డికి లేదని అన్నారు.తన నిబద్ధతకు, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధానానికీ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలకూ, మొన్నటివరకూ తన సహచరుడిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థే సాక్ష్యం అని గాంధీ గుర్తు చేసారు.నా పై కబ్జా ఆరోపణలు చేశావు కాదా అందులో నిజం అని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటాను, నీవు నిరూపించ లేకపోతే నీవు రాజకీయ సన్యాసం కు సిద్ధమా రేవంత్ రెడ్డి, గోపన్ పల్లి లోని సర్వే నెంబర్ 127 లో నీవు చేసిన కబ్జా బాగోతం ప్రజలందరికీ తెలుసు రేవంత్ రెడ్డి,కావాలంటే నేను నిరూపిస్తాను అని ఘాటుగా విమర్శించారు. రేవంత్ రెడ్డి నీ కబ్జా బాగోతం నిరూపించడానికి ఏ వేదిక మీద ఐన సరే నేను సిద్ధం అని, అవాకులు, చవాకులు, తప్పుడు ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్ గాంధీ గట్టిగా హెచ్చరించారు.

# శివ నామస్మరణతో మార్మోగిన వెలుగుట్ట ప్రాంతం

**భక్తుల కోరికలు తీర్చే బోలా శంకరుడు**





ఉప్పల్( ప్రశ్న న్యూస్) ఉప్పల్ క్రికెట్ స్టేడియం పక్కన వెలుగు గుట్ట మీద కొలువైయున్న శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి భక్తుల కోరికలను తీర్చు కొంగుబంగారమై వెలిసియున్నారు. కార్తీకమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నాలుగు గంటల 30 నిమిషాలకు మహన్యాస పూర్వకంగా రుద్రాభిషేకము తో ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు నిరంతరాయంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం పర్వదినం పురస్కరించుకొని భక్తులతో వెలుగుట్ట ప్రాంతంలో శివ నామస్మరణతో, శివ పంచాక్షరి మంత్రంతో ఆ ప్రాంతమంతా మారుమరోగింది, ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు భక్తుల తో వైభవంగా నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.సాయంత్రం 6 గంటలకు ప్రతి నిత్యం లాగే ఆకాశదీపార్చన, స్వామివారికి అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కన్నుల పండుగా నిర్వహించారు.ఈ విశేష కార్యక్రమాలు ఆలయ అర్చక సిబ్బందితో పాటు గొరిగే మల్లేష్ (ఏ.జి.పి) దంపతులు మరియు పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లాస్యనందిత గెలుపు కోసం ప్రత్యేక పూజలు జెఎంఆర్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు కోసం స్థానిక నేతలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఒకటో వార్డులో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యపరిచి గులాబీ పార్టీని గెలిపించాలని విన్నవించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే విజయాన్ని తీసుకువస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితో కలిసి ప్రచారం చేసి సంక్షేమ పథకాలను వివరించారు. 9 ఏళ్ల కాలంలో నియోజకవర్గానికి తాగునీరు, మురుగునీరు నిర్వహణ, మౌలిక సౌకర్యాలు,పలు సంక్షేమ పథకాలు కల్పించిన ప్రభుత్వాన్ని మరొకసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు.బాపూజీ నగర్ కొండాపురం న్యూ బోయిన్పల్లి వార్డు వన్ కు చెందిన పలువురు నాయకులు అభ్యర్థి లాస్య నందిత,మాజీ బోర్డుఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, స్థానిక నేతలు మణికుమార్ రమేష్,రవీందర్,సురేందర్, శివశంకర్,మహేష్, సునీత, సంగీత,గౌతమి,మీనా,లడ్డు జై తదితరులు పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్ తో కలిసి ఒకటో వార్డ్ స్థానిక శ్రీ సిద్ధి దత్తత్రేయ దుర్గ భవానీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఈనెల 30న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అభ్యర్థి లాస్య నందిత భారీ మెజారిటీతో గెలిచి, సిఎం కేసిఆర్ కి కానుక ఇవ్వాలని మనసులో ఉన్న కోరికను అమ్మతో పంచుకున్నట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో సాయి,చరణ్,సతీష్,రాకేష్, సంధ్య, పూజ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు

**ఉప్పల్ నియోజకవర్గం భగాయత్ లో మాదిగ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తా**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్ హొటల్ స్వాగత్ గ్రాండ్ లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సంద్రపల్లి వెంకటయ్య సభాధ్యక్షతన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోరిన విధంగా ఉప్పల్ భగాయత్ లో మాదిగ భవన్ ఏర్పాటు కోసం స్థలం కేటాయింపుకు సంబంధించి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి స్థల కేటాయింపుకు కృషి చేస్తానని మరియు 2 కోట్ల రూపాయల నా సొంత నిధులతో మాదిగ భవన్ నిర్మాణంలో భాగస్వామిని అవుతానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ సామాజిక వర్గంకోసం ఉప్పల్ నియోజకవర్గంలో మాదిగ భవన్ ఏర్పాటు అనేది గొప్ప విషయం అని, దాంట్లో నేను భాగస్వామ్యం అవడం అనేది నాకు చాలా సంతోషంగా ఉందని, ఇది ఒక గొప్ప అవకాశంగా భావించి గెలిచిన వెంటనే మాదిగ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గం సంక్షేమానికి పెద్దపీట వేసిందని, దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని ఆలోచన దళిత బందు పథకం అని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తుందని, ఎస్సీ సామాజిక వర్గం యొక్క పేదరికం రూపుమాపి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచి సమాజంలో ఆత్మగౌరవంతో బతకాలనే గొప్ప సంకల్పంతో ఎస్సీ సామాజిక వర్గం సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మన నియోజకవర్గంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్నికల తర్వాత దళితబంధు పథకం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మన జిల్లాలోని 12 ఎస్సీ సంక్షేమ వసతి గృహాల ద్వారా ఎంతో మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారని, రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లక్ష 16 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని మూడోసారి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి దానిని రెట్టింపు చేస్తారని అన్నారు.అనంతరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, కోర్ కమిటీ మెంబర్స్ నాగారం బాబు మాదిగ, మంచాల యాదగిరి, కుమ్మరి సంఘం యాదగిరి, మాజీ కౌన్సిలర్ ముత్యాల నరసింహ, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, సెక్రటరీ బొల్లం జ్యోతి, మేడ్చల్ జిల్లా సెక్రటరీ వేముల హరిబాబు, గద్దల దుర్గయ్య, గొర్ల జగన్, మైలారం నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో ముమ్మరంగా సాగుతున్న బీఆర్ఎస్ ప్రచారం

**నియోజకవర్గంలోని అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకుంటున్న బండారి**





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం పాతబస్తీ భరత్ నగర్ రజక సంఘంతో ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశమయ్యారు.

సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రజా నాయకులుగా పేరు తెచ్చుకున్నవారు ఎప్పటికీ వారి గుండెల్లో నిలిచే ఉంటారని, ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సు కోసమే తపిస్తూ ఉండే వ్యక్తి బండారి లక్ష్మారెడ్డి అని, అనునిత్యం ప్రజల్లో ఉంటూ, పలు సేవా కార్యక్రమాలతో సాగిపోతున్న అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి నియోజకవర్గంలోని అన్ని వర్గాలనుండి సంపూర్ణ మద్దతు, ప్రజల ఆదరణ లభిస్తోందని తెలిపారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కులవృత్తుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో రజకులకు భరోసా లభించిందని, దోభీఘాట్లకు అందిస్తున్న 250 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ద్వారా ఇప్పటికే లక్షలమంది రజకవృత్తిదారులు లబ్ధి పొందతున్నారన్నారు. ప్రభుత్వ సంస్థల్లో లాండ్రీ కాంట్రాక్టును పూర్తిగా రజకులకే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఒక్క అవకాశం ఇవ్వండి ఉప్పల్ ప్రజలకు సేవ చేస్తా అని, ఈనెల 30వ తారీకు జరిగే ఎన్నికలలో ఈవీఎం మిషన్లో మూడో నెంబర్ లో ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. పిలుపు మేర దూరంలో ఉంటూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ ఉప్పల్ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం నేతలు మాట్లాడుతూ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరటికాయల భాస్కర్, రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర కృష్ణ, జూపల్లి శ్రీనివాస్, అంతిగారి జంగయ్య, ముదిగొండ రవీందర్, ముదిగొండ బాలకృష్ణ, అంతిగారి రవి, ముదిగొండ శ్రీకాంత్, అంతిగారి పాండు, జూపల్లి బంటి, ఎర్ర అశోక్ మరియు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముషీరా'బాద్ షా' ముఠా గోపాల్

**- ఈసారి లక్ష ఓట్ల దిశగా సాగుతున్న సిట్టింగ్ ఎమ్మెల్యే - 2018లో నియోజకవర్గం చరిత్రలోనే అత్యధిక మెజార్టీ**

**72,997 ఓట్లు పొందిన బీఆర్ఎస్ నాయకుడు 50 శాతం ఓట్లును దక్కించుకున్న ప్రజానేత**

**ముఠా గోపాల్ నే హ్యాట్రిక్ గెలిపిస్తామంటున్న ఓటర్లు**

**ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్)**గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో ముఠా గోపాల్ మరోసారి ఎమ్మెల్యేగా గెలవనున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ అభ్యర్థినే మళ్లీ గెలిపించుకుంటామని నియోజకవర్గ ఓటర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ముషీరాబాద్'లో ముఠా గోపాలే తమ శాసనసభ్యుడిగా గెలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

### చరిత్ర సృష్టించిన ముషీరాబాద్ ముఠా గోపాల్..

1957 నుంచి 2018 వరకు జరిగిన అన్ని ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే ముఠా గోపాల్ అరుదైన రికార్డును సాధించారు. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో దాదాపు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే అందరికంటే ఎక్కువ మెజార్టీ తెచ్చుకున్న ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ చరిత్ర సృష్టించారు. 2018 ముందస్తు ఎన్నికల్లో దాదాపుగా 73 వేల ఓట్లు తెచ్చుకున్నారు. దీంతో 50 ఓట్ల శాతాన్ని పొందారు. గతంలో ఏ ఎమ్మెల్యే ఇన్ని ఓట్లు సాధించలేదు.

### 1999 తర్వాత ఇదే ప్రథమం..

ముషీరాబాద్ పరిధిలో ఒక ఎమ్మెల్యే అభ్యర్థి 70 వేల మార్కు రెండు సార్లు నమోదైంది. మొదటిసారి 1999లో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కే.లక్ష్మణ్ 71,413 ఓట్లు తెచ్చుకున్నారు.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2018లో ముఠా గోపాల్ రెండోసారి టీఆర్ఎస్ అభ్యర్థిగా ఏకంగా 72 వేల 997 ఓట్లను సాధించి ఆల్ టైమ్ రికార్డు సాధించడం విశేషం. దాదాపు రెండు దశాబ్దాల రికార్డును ఆయన అధిగమించారు. 2023లో బీఆర్ఎస్ తరపున హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ముఠా గోపాల్ పై భారీగా అంచనాలు నెలకొన్నాయి.

### లక్ష ఓట్ల రేసులో ముఠా గోపాల్..

ఈసారి 2023 ఎన్నికల్లో ముఠా గోపాల్ లక్ష ఓట్లు సాధించే అవకాశం ఉన్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. మరోవైపు ఓటర్లు కూడా గోపాల్ పాలనకే మొగ్గుచూపిస్తున్నారు. దీంతో ఈసారి మెజార్టీ 50 వేలు దాటనుందని తెలుస్తోంది. అదే జరిగితే మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా ముఠా గోపాల్ సరికొత్త చరిత్రను లిఖించే అవకాశమున్నట్లు స్థానిక ఓటర్లు భావిస్తున్నారు.

### ఈసారి 50వేలకు పైగా మెజారిటీ..

2014లో జరిగిన తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున బరిలోకి దిగిన టీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కె.లక్ష్మణ్ చేతిలో 27,338 ఓట్ల తేడాతో ఓడిపోయాడు.
అయితే 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ పై 36,910 ఓట్ల భారీ మెజారిటీతో విజయదుందుభి మోగించారు. ఇదే ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే లక్షణ్ చేతులెత్తేశారు.



### మైనారిటీల ఓట్లన్నీ ముఠా గోపాల్'కే..



ఇప్పటికే జమాతే-ఈ-ఇస్లామీ హింద్ సంస్థ ఏకపక్షంగా ముఠా గోపాల్, బీఆర్ఎస్ అభ్యర్థికే తమ మద్ధతు అని స్పష్టం చేసింది. ఈ మేరకు ముస్లిం ఓటర్లంతా గులాబీ పార్టీకే ఓ ట్లే య్ వా ల ని పిలుపునిచ్చింది.
మరోవైపు మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ గోపాల్ చాలా మంచి వ్యక్తి అని, ఈసారి కూడా ఆయన్నే ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఏఐఎంఐఎం పార్టీ క్యాడర్'కు పిలుపునిచ్చారు. దీంతో ముస్లిం మైనారిటీ సోదరులంతా పూర్తిగా అధికార బీఆర్ఎస్ పార్టీవైపే నిలుస్తున్నట్లు వెల్లడవుతోంది. ఈ మేరకు ముఠా గోపాల్ గత మెజారిటీ కంటే ఈసారి భారీ ఓట్లు సాధించే అవకాశమున్నట్లు నియోజకవర్గం ఓటర్లు భావిస్తున్నారు.

### గంగపుత్రులు,యాదవులు,మున్నూరుకాపులు జైజై..

ఇంకోవైపు నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఉన్న బలమైన బీసీ సామాజికవర్గాలు గంగపుత్రులు, యాదవ్, మున్నూరు కాపులు మరోసారి తమ మద్ధతు అధికార పార్టీ బీఆర్ఎస్'కేనని స్పష్టం చేశాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ ఓట్లు అన్నీ బీఆర్ఎస్ అభ్యర్థివైపే మళ్లనున్నట్లు నియోజకవర్గం కుల సంఘాల నేతలు ఇప్పటికే ప్రకటించేశారు. అధిక సంఖ్యలో ఉన్న బీసీ కుల సంఘాలన్నీ అధికార బీఆర్ఎస్ పార్టీవైపే మొగ్గు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో అధికంగా ఉన్న బీసీ కుల సంఘాలు, ఎస్సీలు, ఎస్సీలు గులాబీ పార్టీకే వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ముఠా గోపాల్ భారీ ఓట్లతో గెలుపొందే అవకాశాలున్నట్లు ఓటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

---

### ఆర్జీ -1 ఏరియా వర్క్ షాప్'లో

# సోమవారపు బాయ్ బాట

**సింగరేణి కార్మిక హృదయాల్లో వజ్రం**

**కార్మికుల నుంచి అపూర్వ స్పందన**

**సోమారపుకే ఓటు వేసి గెలిపిస్తామని హామీ**




**రామగుండం (ప్రశ్న న్యూస్ )** పెద్దపల్లి జిల్లా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆర్జీ -1 ఏరియా వర్క్ షాప్'లో వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సోమారపు సత్యనారాయణ బాయ్ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు సింగరేణి కార్మికులను ప్రతి ఒక్కరిని కలుస్తూ వజ్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్క సింగరేణి కార్మికులను కలుస్తూ ప్రచారం నిర్వహించారు ప్రతి ఒక్క సింగరేణి కార్మికులను కలుస్తూ వజ్రం




గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రతి ఒక్కరిని ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సోమారపు లావణ్య అరుణ్ కుమార్, భాషబోయిన వాసు,కృష్ణ, రవి నాయక్, జనగామ రాయలింగు, సురేష్ పటేల్, సునీల్ కుమార్, అరవింద్ యాదవ్, కిషోర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఇంటింటి ప్రచారం చేస్తున్న సేవలాల్ నాయక్

**- నేత కొరకు కార్యకర్త కాళ్లు మొక్కి ఓటు వేయాలని అడుగుతున్నా సేవలాల్ నాయక్**



ధర్పల్లి(ప్రశ్నన్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల లోని మద్రయి తండాలో సేవాలాల్ నాయక్ ఆధ్వర్యంలో బిజెపి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి ఓటేయాలని ప్రచారం చేస్తూ అందరికీ బిజెపి మేనిఫెస్టో చదివి వినిపిస్తూ వరికి మద్దతు ధర 3 వేల ఒక 100 రైతుల, సబ్సిడీ ఆవాస్ యోజన పథకం కింద ప్రతి ఒక్కరికి ఇల్లు, ఆరోగ్యశ్రీ లాగా ఆయుష్మాన్



భారత్ పథకం 25 లక్షలకు ఇన్సూరెన్స్ నిర్ణయించారు. ఇంకా ఇలాగే చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు తెస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారు. ఇప్పటివరకు ఏ బాంబ్ బ్లాస్ట్ లు లేవు అలాంటి మహనీయుని మనం గుర్తుపెట్టుకోవాలి. భూమి నుంచి ఆకాశం లోకి ఎగిరి చంద్రమండలం చేరిన మన శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు.బిజెపి మేనిఫెస్టోలో వరికి 3100, ఆరోగ్య శ్రీ, ఆరోగ్య భీమా, ఇలాంటి పథకాలు ఎన్నో పెట్టారు. ఈ కార్యక్రమంలో బాదావత్ సేవాలాల్, మెగావత్ మున్ని, గుగులోత్ నాగేష్, కేతావత్ మైపాల్, మెగావత్ శివరాం, బాదావత్ గణేష్, మలావత్ వెంకటేష్, బాదావత్ రవి, గుగులోతు రఘుపతి, బాదావత్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసాన 38వ జాతర



ధర్పల్లి(ప్రశ్నన్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల్ వాడి గ్రామంలో పద్మశాలీల ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా గంగాధరయ ఆలయంలో ప్రతి సంవత్సరం కార్తీకమాసంన యజ్ఞ యాగాలు నిర్వహిస్తారు. ముంబై పూనా లాంటి మహానగరాలను నివసిస్తున్న భక్తులు ప్రతి సంవత్సరం కార్తీక మాసం రోజున ఇక్కడ పూజల కొరకై తమ పనులు పక్కనపెట్టి వస్తారు. పూజల అనంతరం అన్న సత్రం కూడా నిర్వహిస్తారు.ప్రతి సంవత్సరం నాలుగు నుంచి ఐదువేల మంది వచ్చి దేవుని ఆశీస్సులు పొందుతారు. అన్న సత్రం 5000 మందికి మీరు నిర్వహిస్తారు. ఈ ఆలయం వెలిసి 38 సంవత్సరాలు అవుతుంది. ఈ జాతరను వాడి పద్మశాలి సంఘం, ఆలయ కమిటీ చైర్మన్ కట్ట మచ్చెందర్, గంగ మోహన్, జిల్లా సెక్రటరీ ఎల్లారం భాస్కర్, కట్ట రవీందర్, శంకర్, గంగా దాస్, తాళ్ల కాడి మోహన్, భూమేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

---

## కాలనీ సంక్షేమ అభివృద్ధి

# బీఆర్ఎస్ పార్టీలో సాధ్యం

**- మర్రి రాజశేఖర్ రెడ్డి**



మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి నియోజకవర్గంలో కాలనీ సంక్షేమాల అభివృద్ధి భారతీయ రాష్ట్ర సమితి తోనే సాధ్యమని మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మధుసూదన నగర్



కమిటీ హాల్లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్గిరి సర్కిల్ ఎన్నికల ఇన్చార్జి ఆర్ జితేందర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి హాజరయ్యారు. సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న అన్ని కాలనీలా అభివృద్ధి భారతీయ రాష్ట్ర సమితి ప్రభుత్వ హాయంలోనే జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజ్గిరి లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. అవునా ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, మహిళా నాయకురాలు స్వప్న, మహిళా అధ్యక్షురాలు కోల లీల, మాజీ వార్డు కమిటీ సభ్యులు మేకల లక్ష్మణ్ యాదవ్, సతీష్, సాయి రెడ్డి మరియు సాయి బాచు, నాయకులు కార్యకర్తలు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం లో కార్తీక పౌర్ణమి సందర్భంగా

## హటకేశ్వరంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ కార్యక్రమం





శ్రీశైలం (ప్రశ్న న్యూస్)కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ కాళీ వారాహి త్రిశక్తి పీఠం గురువుగారు అయిన బ్రహ్మశ్రీ నవీన్ శర్మ పర్యవేక్షణలో వారి శిష్యబృందం శ్రీశైలం జ్యోతిర్లింగక్షేత్రం లోని హటకేశ్వరంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి సాధువులు,భక్తులు భారీగా వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా శిష్యబృందం మాట్లాడుతూ తాము చేపట్టిన అన్నప్రసాదం కార్యక్రమం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి,గురువుగారి అనుగ్రహంతో అశేష ఆదరణ లభించడం చాలా ఆనందదాయకం గా ఉందన్నారు మరియు శ్రీ లలిత పీఠం వారి సహకారంతో ఈ కార్యక్రమం విజయవతంగా పూర్తి చేయగలిగాము అని శిష్యబృందం సభ్యులు తెలియజేశారు.

---

## కిటకిటలాడిన త్రిపురాంతకేశ్వర

# వీరభద్రస్వామి ఆలయం.



ఆమనగల్ (ప్రశ్న న్యూస్) కార్తీక పౌర్ణమి సందర్బంగా ఆమనగల్ మండల పరిధిలోని అయ్యసాగర క్షేత్ర త్రిపురాంతకేశ్వర శ్రీ వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి పెరిగింది. కార్తీక పౌర్ణమి సందర్బంగా అయ్యసాగర కేత్రంలోని శ్రీవీరభధ్రస్వామి రంగురంగుల పూలతో అత్యంత శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక విశేష పూజలను చేసారు.అలాగే స్వామివారి సన్నిధిలో భక్తులు దాదాపు 20 వరకు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారని ప్రధాన అర్చకులు నాగరాజు తెలిపారు. ఇక శివాలయంలో కొలువైన శివయ్య సన్నిధిలో వందలకొద్ది కార్తీక దీపాలను



వెలిగించడంలో అత్యధిక మహిళలు పోటీపడ్డారు. అలాగే స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలతో ప్రత్యేక విశేష పూజలను ఆచరించారని, అలాగే కార్తీక పౌర్ణమి నేపధ్యంలో భక్తులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారని ఆలయ ప్రధాన పూజారి శేఖర్ తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్బంగా అయ్యసాగర క్షేత్రానికి వచ్చిన భక్తులు తమ బందు మిత్రులతో కలిసి భక్తిశ్రద్ధలతో పూజలను చేయడంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఇక అక్కడి అహ్లాదకర వాతావరణంలో వంటలను చేసుకొని వనభోజనాలను చేయడంతో భక్తులు పులకించిపోయారు.

## ఘనంగా బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) బండారు లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను రామంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జోష్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాంద్రోన్ పల్లి గిరిబాబు మహారాజ్ మాట్లాడుతూ బండారి లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు అభాగ్యులకు, ఆర్థిక సహాయం చేయడంతో పాటు విద్యార్థులు మెడిసిన్ సీటు సాధిస్తే వారికి నాలుగు సంవత్సరాల ఫీజు మొత్తము కట్టి చదివిస్తూ, బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలవడం,అన్నా అంటే తానున్నానంటూ తనకు తోచిన సహాయాన్ని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ముందుంటున్న వ్యక్తి బండారి లక్ష్మారెడ్డి అని 30వ తారీకు జరిగే ఎన్నికల్లో కారు గుర్తు పై ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని అసెంబ్లీకి పంపవలసిందిగా గిరిబాబు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కే.రవికుమార్, సింహాద్రి, మహిళా నాయకురాలు విజయ, జయ, కావ్య, పప్పీ తదితరులు పాల్గొన్నారు.

# మా మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకే

**-తెలంగాణ ఎరుకల సంఘం అధ్యక్షుడు రస్థాపురం సత్యనారాయణ**

**- ఎమ్మెల్యే గాంధీ కే మా మద్దతు పలు గేటెడ్ కమ్యూనిటీ వాసుల తీర్మానం**







శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎరుకల సంఘం (కుర్రు) కార్యవర్గ సభ్యులు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీకి సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి ఆపత్రాన్ని గాంధీకి అందజేశారు. సోమవారం తెలంగాణ ఎరుకల సంఘం (కుర్రు) గ్రేటర్ హైదరబాద్ కమిటీ అధ్యక్షులు రస్థాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిజిలి ఎల్లేశ్ ఎరుకల సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఎరుకల ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేశారు. బీఆర్ ఎస్ అభ్యర్థి గాంధీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎరుకల సంఘం కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మా పూర్తి స్థాయి మద్దతు ప్రభుత్వ విప్ గాంధీకే ఉంటుందని, గాంధీకి అన్ని విధాలుగా అండగా ఉండి అఖండ మెజారిటీతో గెలిపించుకుంటాం అని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేవిధంగా కృషి చేశారని, మంచి మనసున్న వ్యక్తి ఆరెకపూడి గాంధీ అని, మరోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం అని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎరుకల సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శేరిలింగంపల్లి బీఆర్ ఎస్ అభ్యర్థి అరేకపూడి గాంధీ హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని మై హోమ్ జ్యూవెల్, సాయి రాం టవర్స్, భాను టౌన్ షిప్ అపార్ట్మెంట్స్ వాసులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ నివాసితులు అరేకపూడి గాంధీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని నిరంతరం అభివృద్ధి చేస్తూ ముందుకు నడిపిస్తున్న అరేకపూడి గాంధీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. బీఆర్ ఎస్ వల్లనే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమని, మరోసారి గాంధీ విజయానికి శయాశక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ నివాసితులు, పలువురు బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గంలో బండారి లక్ష్మారెడ్డి ని గెలిపించుకుంటాం





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ కులస్తులు కారు గుర్తుపై ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల కు ఓటు వేయాలని గౌడ కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింగ్ రావు గౌడ్ తెలిపారు. రామంతపూర్ డివిజన్లో పాలకూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు గౌడ కులస్తుల మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నూట మూడు కల్లు సొసైటీలను తెరిపించారని, ప్రతి సంవత్సరం 20 కోట్ల రెంటాల్స్ మాఫీ చేశారని, సర్దర్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ,వర్ధంతి, ని అధికారికంగా నిర్వహిస్తున్నారని పాపన్న 30 ఫీట్ల విగ్రహం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేస్తామని తెలిపారని, హైదరాబాద్ నడి ఒడ్డున నీరా కేఫ్ ని ఏర్పాటు చేశారని, కల్లుగీత కార్మికుల కోసం గీతా భీమా తీసుకొచ్చారని, హరితరంలో భాగంగా ఈత తాటి వనాలు ఏర్పాటు చేసి నాలుగు కోట్ల చెట్టు నాటారని గౌడ్ ఆత్మీయ భవనాల కోసం కోకాపేటలో ఐదు ఎకరాలు ఐదు కోట్ల రూపాయలు ఇచ్చారని, వైన్ షాపులో 15 శాతం రిజర్వేషన్ కల్పించారని, తెలంగాణలో ప్రతి జిల్లాలో గౌడ సంక్షేమ భవనం కోసం ఒక ఎకరం స్థలం తో పాటు ఒక కోటి రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, కల్లుగీత కార్మికుల మరణాలు అరికట్టేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం బీహార్ నుంచి పోట్టి తాటి మొక్కలను తెప్పించడం జరుగుతుందని ఈ మొక్కలు ఆరు నుండి ఏడు ఫీట్ల వరకు పెరుగుతాయని ఇవే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో 35 సంవత్సరాలు సేవ చేసిన నేను మాటలు తప్ప చేతలు ఎక్కడ కాంగ్రెస్ పార్టీ చేయలేదని, బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బడుగు బలహీన వర్గాలకు అన్ని కుల సంఘాలకు స్థలాలను కేటాయించి భవన నిర్మాణాల కోసం కోట్ల రూపాయలను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని, బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వానికి గౌడ కులస్తుల మందరం మద్దతు తెలపాలని 30 వ తారీకు జరిగే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ కులస్తులు కారు గుర్తు పై ఓటు వేయాలని లక్ష్మణరావు గౌడ్ తెలిపారు.ఎన్నికల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకటించడం సౌభాగ్య లక్ష్మి మూడు వేల రూపాయలు, గ్యాస్ సిలిండర్ 400 రూపాయలు, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం, పెన్షన్ 5016 లు, రైతుబంధు ఎకరానికి 16,000, ఐదు లక్షల బీమా, ఆరోగ్యశ్రీ బీమా 15 లక్షల పెంచడం మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు చూస్తుంటే రాబోయే రోజుల్లో ప్రకటించని పథకాలు మరెన్నో ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాలకు, అందిస్తారని ప్రభుత్వం గౌడ కులస్తులకు అన్ని విధాల ఆదుకుంటుందని ఈ సందర్భంగా పల్లె లక్ష్మణరావు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకూరి దాస్ గౌడ్, వినయ్ గౌడ్,నేమూరి శ్రీకాంత్ గౌడ్,కూనూరు యాదగిరి గౌడ్, సత్యనారాయణ గౌడ్, మల్లేశం గౌడ్, ఆనందం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో జోరు పెంచిన కారు

**వరుస సమావేశాలు, పాదయాత్రలతో నిత్యం ప్రజల్లో అభ్యర్థి బండారి కి పెరుగుతున్న ప్రజాదరణ**

**ఉప్పల్ నియోజకవర్గం పెద్ద ఉప్పల్ గౌడ సంక్షేమ సంఘంతో ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం పెద్ద ఉప్పల్ గౌడ సంక్షేమ సంఘంతో ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశమయ్యారు.అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి గౌడ సంఘం మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక గౌడ కులస్తుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. ఈత, తాటి చెట్ల పెంపకంతోపాటు పింఛన్, బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ఒక అవకాశం ఇవ్వండి ఉప్పల్ ప్రజలకు సేవ చేస్తా అని ఈనెల 30వ తారీకు జరిగే ఎన్నికలలో ఈవీఎం మిషన్లో మూడో నెంబర్ లో ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. పిలుపు మేర దూరంలో ఉంటూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ ఉప్పల్ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని అన్నారు. నా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. లక్ష్మారెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని గౌడ కులస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అరటికాయల భాస్కర్, గౌడ సంఘం అధ్యక్షులు బజారు హరినాథ్ గౌడ్, బూత్కుల పెంటయ్య గౌడ్, మీనంపల్లి అశోక్ గౌడ్, పండ్ల శ్రీనివాస్ గౌడ్, మీనంపల్లి నరసింహ గౌడ్, కందికట్ల అశోక్ గౌడ్, పంజాల జైహింద్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, రాజ్ కుమార్,బింగి భరత్ గౌడ్ మరియు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల పనులను వేగవంతం చేయాలి

**- జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**జగిత్యాల** ఓట్ల లెక్కింపు కేంద్రాల పనులను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు.

ఆదివారం రోజున నూకపల్లి లోని విఆర్కె కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం లో చేపడుతున్న పనులను రిటర్నింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 28 లోగా పనులను పూర్తిచేయాలని, ఏజెంట్లకు, అధికారులకు ఏర్పాటు చేసిన క్యూ లైన్ లు తెలుపుతూ బోర్డ్ లను ఏర్పాటు చేయాలని, ఓట్ల లెక్కింపు కోసం టేబుళ్ళ ను సక్రమంగా అమర్చాలని తెలిపారు. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి లెక్కింపు కేంద్రాల్లోని గదులను పరిశీలించారు. సి సి కేమరాలను భవనం చుట్టు బిగించాలని తెలిపారు. ఆయా రిటర్నింగ్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, రిటర్నింగ్ అధికారులు దివాకర, నరసింహ మూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాలేరు 'కారు'లో గులాబీ గుబాలింపు

**అంబర్ పేటలో మరోసారి కాలేరు వెంకటేశ్**

**బలమైన బీసీ నేతగా ప్రజల్లో ఆదరణ**

**అందరివాడుగా పేరు గాంచిన సిట్టింగ్ ఎమ్మెల్యే**

**మరోసారి అసెంబ్లీలో అడుగుపెడతారని స్థానికుల విశ్వాసం**

**అంబర్ పేట బీఆర్ఎస్ తొలి ఎమ్మెల్యేగా కాలేరు రికార్డు**



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట అసెంబ్లీ పరిధిలో కారు జోరు కనబరుస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్ మరోసారి విక్టరీ కొట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఓటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అంబర్ పేట నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో జోరుగా ప్రచారం సాగించారు. ఇంచుమించు ప్రచార పర్వాన్ని పూర్తి చేసినట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ సిటీలో రెండోసారి గెలిచి అంబర్ పేటలో బలమైన బీసీ నాయకుడిగా అవతరించాలని కాలేరు భావిస్తున్నారు. అంబర్ పేటలో అన్ని డివిజన్ల పరిధిలో ఉన్న బలమైన బీసీ ఓట్లపైనే కాలేరు నమ్మకం పెట్టుకున్నట్లు సమాచారం.

### మరోసారి ఎమ్మెల్యేగా కాలేరు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అంబర్ పేట అసెంబ్లీ బరిలో బీఆర్ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మరోసారి బరిలోకి దిగారు. 2018 ముందస్తు ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించిన కాలేరు, మరోదఫా విజయదుందుభి మోగించేందుకు సిద్ధమవుతున్నారని నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

### కిషన్ రెడ్డి జైత్రయాత్రకి కాలేరు బ్రేక్..

అప్పటి టీఆర్ఎస్ అధ్యక్షుడు, నేటి బీఆర్ఎస్ ప్రెసిడెంట్, సీఎం కేసీఆర్ 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. దీంతో అంబర్ పేట బీఆర్ఎస్ అభ్యర్థిగా కాలేరు వెంకటేశ్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో సీనియర్ బీజేపీ నేత, నేటి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని అనూహ్యంగా ఓడించి రాష్ట్రంలో సంచలన విజయాన్ని నమోదు చేశారు.



### పదవీ కాలం

తొలిసారిగా 2018లో అంబర్ పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం 2023 కొనసాగుతున్నారు. రెండో సారి బరిలో గులాబీ పార్టీ నుంచి బరిలో నిలిచారు.

### కుటుంబ నేపథ్యం..

ఆంజనేయులు, జయమ్మ దంపతులకు 1960 డిసెంబరు 10న గోల్నాకలో జన్మించారు. 1986లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ, ఎల్ఎల్.బి డిగ్రీలను పూర్తి చేసిన, కాలేరు వెంకటేశ్ న్యాయవాద వృత్తిని చేపట్టాడు. 2005లో హైదరాబాద్'లోని క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్'కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం 2012 వరకు ఆ పదవిలో కొనసాగారు.

### ఆదర్శ దంపతులు..

కాలేరు వెంకటేశ్‌కు పద్మతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు కాలేరు మణికాంత్, దీప్తి పటేల్ ఉన్నారు. అయితే కాలేరు పద్మ 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గోల్నాక కార్పోరేటర్'గా గెలిచారు. 2018లో గెలిచిన కాలేరు, భార్య పద్మతో కలిసి ప్రజలకు సేవలందించి నియోజకవర్గంలో ఆదర్శవంతమైన బీసీ రాజకీయ దంపతులుగా పేరు గాంచారు.

### రాజకీయ నేపథ్యం..

2009 నుంచి 2014 వరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో గోల్నాక కార్పొరేటర్'గా కొనసాగారు. అనంతరం 2014లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరారు.



2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ అంబర్‌పేట్ శాసనసభ బరిలో నిలిచి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే సమీప భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జీ.కిషన్ రెడ్డిపై 1016 ఓట్ల తేడాతో గెలుపొందారు.

### అందరి బంధువు కాలేరు..

2018లో పోటా పోటీగా జరిగిన ఎన్నికల్లో కాలేరు ఉత్కంఠ విజయం సాధించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి ఫలాలను పేదలకు, మధ్యతరగతి ప్రజలకు, యువతకు, మహిళలకు అందేలా కృషి చేశారు. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్ కార్డులు, గృహలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా లాంటి పథకాలతో పాటు ఎల్ఆర్ఎస్, బల్దియా సేవలు అందరికీ అందేలా చొరవ తీసుకున్నారు.

### అంబర్ పేటతో కాలేరుకు ప్రజానుబంధం..

నియోజకవర్గంలో ఎవరికీ ఏ కష్టం వచ్చినా ఆదుకుంటారనే పేరును సంపాదించారు. ప్రత్యేకించి పేదలపై ఎక్కువ దృష్టి పెట్టి వారికి అవసరమైన సాయంలో ఆసరాగా నిలబడతారనే కీర్తిని గడించారు. అందుకే ప్రజలంతా ఆయన్ను ఇష్టపడతారని, ఇదే సమయంలో కాలేరు గుండాయిజం, రౌడీయిజం లాంటి అక్రమాలకు దూరంగా ఉండటం కాలేరుకు కలిసొచ్చే అంశంగా నిలవనుంది.

### అన్ని డివిజన్లలోనూ కారుదే జోరు..

అంబర్ పేట డివిజన్, కాచిగూడ డివిజన్, నల్లకుంట డివిజన్, బాగ్ అంబర్ పేట డివిజన్, గోల్నాక డివిజన్ పరిధిలో ఉన్న అంబర్ పేటలో గంగపుత్రులు, ముదిరాజ్ , యాదవ్, పద్మశాలి, గౌడ్ , ఎస్సీలు , మైనార్టీలు అత్యధిక జనాభాతో ఉన్నారు. ఆయా వర్గాల ఓటర్లను ప్రసన్నం చేసుకున్నవారికే గెలుపు అవకాశాలున్నాయి.

### క్లీన్ అంబర్ పేట దిశగా కాలేరు..

గతంలో కురిసిన భారీ వర్షాలకు అంబర్ పేట డివిజన్ లోని పటేల్ నగర్, అహ్మద్ నగర్ మూసి ఉన్న కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం, జేసీబీ సహాయంతో తొలగించారు. అంబర్ పేట డివిజన్ లోని చెన్నారెడ్డి నగర్ ముంపు ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి నడుం బిగించారు.

మరోసారి అంబర్ పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, పేటను క్లీన్ గా మార్చేందుకు కాలేరు మళ్లీ గెలవాలని నియోజకవర్గంలోని అట్టడుగు వర్గాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఈసారి కూడా కాలేరు విజయం వైపుగా పయనిస్తున్నారని అంతా భావిస్తున్నారు. ఇదే జరిగితే వరుసగా రెండోసారి అంబర్ పేట శాసనసభ్యుడిగా కాలేరు గెలుపు తథ్యం కానుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### కాలేరు అభివృద్ధి పనులు..

అలీ కేఫ్ చౌరస్తా నుంచి గోల్నాక వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యవేక్షణలో పనులు సాగించారు. మంచినీరు సరఫరా, నిత్యావసర సరుకుల పంపిణీ, నీటి సరఫరాలో సమస్యలను అధిగమించడం, మురుగు నీటి నిర్వహణ, నాలా సమస్యలు, రోడ్డు నిర్మాణం, కరెంట్ సమస్యలు, వీటిపై కాలేరు ప్రత్యేకంగా దృష్టి సారించి ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పాలన సాగించారని స్థానికులు అంటున్నారు.

# గ్రేటర్ బీఆర్ఎస్ నుంచి మంత్రి రేసులో ముఠా గోపాల్, కాలేరు

**- ఈసారి కొత్త వాళ్లకు ఛాన్స్ ఇచ్చే యోచనలో కేసీఆర్ - గతంలో మంత్రులుగా పనిచేసిన తలసాని, పద్మారావు, దానం**
**- మంత్రిమండలిలోకి ముషీరాబాద్, అంబర్ పేట ఎమ్మెల్యేలు - మార్పు కోరుకుంటున్న గ్రేటర్ హైదరాబాద్ వాసులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడనుంది. ఈ మేరకు తెలంగాణలో గులాబీ పార్టీకి మరో పొలిటికల్ వేవ్ కనిపిస్తోంది. అయితే జిల్లాల సంగతి అటుంచితే, కీలకమైన రాజధాని మహానగరం నుంచి ఈసారి కేసీఆర్ కేబినెట్'లోకి కొత్త వారిని తీసుకోవాలని సిటీ ఓటర్లు కోరుతున్నారు.

### మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యేలు..

ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సైతం ఇప్పటివరకు మంత్రిగా పనిచేయని సీనియర్ ఎమ్మెల్యేలనే మంత్రులుగా తీసుకోవాలని భావిస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ శ్రేణుల్లో కనిపిస్తోంది. 1. సనత్ నగర్ - తలసాని శ్రీనివాస్ యాదవ్ - రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగారు. 2. పద్మరావు గౌడ్ - 2014 నుంచి 2018 వరకు మంత్రిగా పనిచేశారు. 3. దానం నాగేందర్ - ఉమ్మడి ఏపీలో గతంలో మంత్రిగా ఉన్నారు. ఇక జూబ్లీహిల్స్, గోషామహల్, మలక్ పేట, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాలకు మంత్రి స్థాయి అభ్యర్థులు లేరు.

### ముషీరాబాద్'కే ఛాన్స్ ఎక్కువ..

ఇక మిగిలింది ముషీరాబాద్, అంబర్ పేట నియోజకవర్గాలే. అయితే సికింద్రబాద్ లోక్ సభ పరిధిలో ఉంటే ఈ రెండు నియోజకవర్గాల్లో ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ బీఆర్ఎస్ అభ్యర్థులుగా కొనసాగుతున్నారు. ఇందులో ముఠా గోపాల్ 71 ఏళ్ల అత్యంత సీనియర్ నాయకుడు. ఇప్పటికే బీఆర్ఎస్ బీసీ సెల్ తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.





### గ్రేటర్ పెద్దన్న ముఠా గోపాల్..

సిటీలోనే అత్యంత సీనియర్ గులాబీ పార్టీ నాయకుడు. హ్యాట్రిక్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కొనసాగుతున్నారు. ఈసారి గ్రేటర్ నుంచి మంత్రి అయ్యే అవకాశాలు ముఠా గోపాల్'కే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మూడోసారి ఏర్పడబోయే కేసీఆర్ సర్కారులో మంత్రి ముఠా గోపాల్'గా ఆయన చరిత్ర సృష్టించనున్నారు.

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజయం తథ్యం

**-నాగుల శ్రీనివాస్**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ నియోజవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజయం తథ్యమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకుడు బిఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజా సమస్యలు తీర్చడంలో ముందుండే నాయకుడు, ఉప్పల్ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలలో తోడు ఉన్నానని తనకు తోచిన సహాయాన్ని పదిమందికి అందిస్తూ పార్టీ కార్యక్రమంలో పాల్గొంటూ ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి ఎదురులేని ఇంతమంది ఇతర పార్టీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఉప్పల్ ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రజలకు సేవ చేసే నాయకుడు కావాలి, కానీ ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకుడు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు కు అవసరం లేదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని, భారీ మెజార్టీ తో లక్ష్మారెడ్డి ని గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తు బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరుతున్నామని ఈ సందర్భంగా నాగుల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, రంజిత్, పాష సలీం, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ నోట ఢీల్లీ లిక్కర్ స్కామ్ మాట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కమలం పువ్వు వికసించి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కరీంనగర్, మహబుబబాద్, హైదరాబాద్ జిల్లాల్లో నిర్వహించిన విజయ సంకల్ప సభలలో పాల్గోన్న సందర్బంగా పలు ఆసక్తికర విషయాలపై ప్రసంగిస్తు బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలోనే స్మార్ట్ సిటీ కింద నిధులు విడుదల చేసి కరీంనగర్ ను అభివృద్ధి బాట పట్టించామన్నారు. కరీంనగర్ ను లండన్ చేస్తామన్న కేసీఆర్ అబద్ధపు హామీ ఇచ్చారని విర్శిస్తు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై మోదీ స్పందించారు. ఈ ప్రాజెక్టులో ఏం జరిగిందో దేశం మొత్తానికి తెలుసని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు జరిగాయా అని ప్రశ్నించారు. కన్నీళ్లు, మోసాలతో నిరుద్యోగులు మిగిలారని తెలిపారు. కేసీఆర్, ఆయన కుటుంబం లూటీ చేసేందుకే తెలంగాణ వచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలన డిసెంబర్ 3 తో ముగుస్తుందని స్పష్టం చేశారు. మోదీ గ్యారంటీ అంటే గ్యారంటీగా పూర్తెయ్యే గ్యారంటీ అని ప్రధాని అన్నారు. బీజేపీతో సామాజిక న్యాయం సాధ్యమని తేల్చిచెప్పారు. మాదిగలకు న్యాయం చేసేందుకు కమిటీ వేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం రాగానే ఢిల్లీ లిక్కర్ స్కామ్ దర్యాప్తు వేగవంతం చేస్తామన్నారు. 2024లో బీజేపీకి మళ్లీ పట్టం కట్టేందుకు దేశ ప్రజలు నిర్ణయించుకున్నారని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ తో వెలుగు వస్తుందన్నారు. హుజూరాబాద్ ప్రజలు గతంలోనే బీఆర్ఎస్ కు ట్రైలర్ చూపించారని. ఈ ఎన్నికల్లో పూర్తి సినిమా చూపిస్తారని మోదీ అన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని బీసీ వ్యక్తే సీఎం అవుతారని స్పష్టం చేశారు. పదేళ్ల బాలుడి తల్లిదండ్రులు అతని భవిష్యత్ కోసం చాలా ఆలోచిస్తారని ఇప్పుడు పదేళ్ల వయసున్న తెలంగాణకు వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో మార్పు గాలి వీస్తోందని దీంతో మార్పు తథ్యమని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కెసిఆర్ ప్రభుత్వం యువకులు , రైతులు ,మహిళలు నిరుపేదల వ్యతిరేక ప్రభుత్వం

**అవినీతి అక్రమాలు చేసిన ప్రతి ఒక్కరి చిట్టాను ఎంక్వయిరీ చేసి జైలుకు పంపుతాం**
**నిరుపేద అన్ని వర్గ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసే వడ్డీ మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి**
**బిజెపి పార్టీ జాతి అధ్యక్షులు జె .పి నడ్డా**





**బోధన్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం యువకులు, మహిళలు, రైతులు ,నిరుపేద ప్రజల వ్యతిరేక ప్రభుత్వమని, తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత పాలన చేస్తున్న కేసీఆర్కు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి సర్కారు ఏర్పాటుతోపాటు బోధన్ నియోజకవర్గంలో వడ్డీ మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా అన్నారు, నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శకర్ నగర్ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన బహిరంగ సమావేశంలో ఆయన ప్రసంగించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అక్రమ పాలన కొనసాగుతుందని భ్రష్ట చార్ రోజు రోజుకు పెరిగిపోతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అవినీతి అక్రమాలు చేసిందని అలాంటి ప్రభుత్వానికి మళ్లీ అధికారం ఇస్తే మళ్లీ అవినీతి అక్రమాలు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ అవినీతి పాలన చేసిందని అలాంటి పార్టీకి తగిన గుణపాఠం చెప్పి ఓడించండి అని ఆయన అన్నారు. ప్రపంచంలోనే భారతదేశానికి నంబర్ వన్ స్థానంలో, అభివృద్ధి దశలో తీసుకువెళుతున్న ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కిందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒకటి అని అవినీతి అక్రమ పాలన చేస్తూ ప్రజల పాలిట శాపంగా మారాయని అలాంటి పార్టీలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని డిపాజిట్ దక్కకుండా ఓడించాలని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం మోసపూరిత ప్రభుత్వం అని ఇప్పటివరకు ఎవరి కూడా డబుల్ బెడ్ రూమ్ వచ్చినా సందర్భాలు లేవని ఉద్యోగాలు వచ్చిన సందర్భాలు లేవని సంక్షేమ పథకాలు వచ్చినా పరిస్థితులు లేవని ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వ హయంలో ఆరు లక్షల పై ఉద్యోగాలు వచ్చాయని, ఎయిర్పోర్టు, రైల్వే ,రోడ్డు, అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. రామగుండం తో పాటు పసుపు బోర్డు తెచ్చిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వానికి అధికారం లోకి తెస్తే కచ్చితంగా బోధన్ పట్టణంలో మూతబడిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని అన్నారు, బోధన్ నిజం షుగర్ ఫ్యాక్టరీ విషయంలో అవినీతి అక్రమాలు చేసిన ప్రతి ఒక్కరి చిట్టా బయట పెట్టి వారికి జైలుకు పంపుతామని అన్నారు. రైతులకు కింత ధాన్యంకు 3100 ఇస్తామని, అనేక సేవలు రైతులకు అందిస్తామని అన్నారు, చదువుకునే బాలికలకు లాప్టాప్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారి చిట్టా బయటికి తీసి వారి పై ఎంక్వయిరీ చేసి జైలుకు పంపుతామని తెలిపారు. అవినీతి అక్రమ దారులను ఎవర్నీ వదలమని వారి భర్తం పడతామని అన్నారు. కాంగ్రెస్ ,తెరాస పార్టీలు ప్రజల వ్యతిరేక పార్టీలని, బిజెపి పార్టీ ప్రజలకు ఇష్టమైన పార్టీ అని తెలిపారు. అనునిత్యం నిరుపేదలు అన్ని వర్గ ప్రజల కోసం కృషిచేసి, సేవ చేసే వడ్డీ మోహన్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరడం జరిగింది. జేపీ నడ్డా సమావేశానికి భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనడంతో సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది, ఈ జనం చూసి కొంతమంది మాత్రం బిజెపి పార్టీ బోధన్ నియోజకవర్గంలో భారీ మెజారిటీ తో గెలుస్తుందని చర్చించుకోవడం విశేషం ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు పాలకులు నాయకులు పాల్గొన్నారు.

# 30 అడుగుల లోతులోకి ట్రాక్టర్

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని శివపురిలో షాకింగ్ సంఘటన వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌పైకి ఎక్కి చిన్నారి ఆడుకుంటుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ 30 అడుగుల లోతున్న బావిలో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పూర్తిగా దెబ్బతినగా.. చిన్నారి శరీరంపై చిన్న గాయం కూడా లేకపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ ఘటన శివపురి జిల్లా కరైరా పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగూరి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా చర్చణీయాంశమైంది. లంగూరి సర్పంచ్ బలరాం పాల్ తెలిపిన వివరాల ప్రకారం..నబాబ్ జాతవ్ అనే వ్యక్తికి ట్రాక్టర్ ఉంది. ఆ ట్రాక్టర్‌ను ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో పార్క్ చేశారు. నవాబ్‌కు అన్షుల్, సుహాని(3) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరూ నిలిపి ఉన్న ట్రాక్టర్‌పైకి ఎక్కి ఆడుకుంటున్నారు. ఇంతలో అకస్మాత్తుగా గేర్ ఊడిపోవడంతో ట్రాక్టర్ వాలుపైకి వెళ్లడం ప్రారంభించింది. గమనించిన నవాబ్ కుటుంబీకులు వెంటనే సుహానిని రక్షించగలిగారు. అన్షుల్‌ను రక్షించేలోపు ట్రాక్టర్ పక్కనే ఉన్న 30 అడుగుల లోతున్న బావిలో చిన్నారితో సహా పడిపోయింది. ఈ ఘటనలో అన్షుల్ మరణించి ఉంటాడని అక్కడున్న వారంతా అనుకున్నారు.

కానీ బావిలో పిల్లాడు సురక్షితంగా ఉండటం చూపి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విచిత్రమేమంటే.. బాలుడి శరీరంపై చిన్న గాయం కూడా లేదు. ఇక బావిలో పడిన ట్రాక్టర్ మాత్రం నుజ్జునుజ్జయ్యింది. బావి నీళ్లు లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. అందుకే ట్రాక్టర్ అందులో పడిన వెంటనే బావిలో నుంచి పెద్ద ఎత్తున దుమ్ము రేగిందని ఆ ఊరి సర్పంచ్ తెలిపాడు. ఈ ఘటన జరిగిన కొంత సేపటికి దుమ్ము సర్దుమనగడంతో నబాబ్ కుటుంబ సభ్యులు తాడు సాయంతో బావిలోకి దిగి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పూర్తిగా దెబ్బతిన్నట్లు సర్పంచ్ తెలిపారు. ట్రాక్టర్ నుజ్జునుజ్జయిన చిన్నారి సురక్షితంగా ఉండటం నిజంగా అద్భుతం అంటూ ఊరుఊరంతా చెప్పుకోసాగారు.

# రైతు బంధు రగడతో ఎవరికి ముప్పు

**- రైతుబందు విషయంలో ఈసీ నిభందనలకు మంగళం పాడి రైతులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం బెడిసికొట్టిందా**
**- రైతుబందు విడుదలకు అనుమతిచ్చిన ఈసీ యూటర్న్ నిర్ణయం బీఅర్ఎస్ శరాఘాతంగా మారిందా.**
**- రైతుబందు ఆగిపోయినను అధికారంలోకి వచ్చన వెంటనే ఎకరాకు 15 వేలు విడుదల చేస్తామన్న కాంగ్రెస్.**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మరి కొద్ది రోజుల్లో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ అనూహ్య పరిణామలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అధికార బీఆర్ఎస్ కు అన్ని వైపులా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలు ఇప్పటికే పార్టీని ఇరుకున పెట్టేల ఉంటే ఇప్పుడు రైతు బంధు విషయంలో రగులుకున్న రగడ బీఆర్ఎస్ కు మరింత చిక్కులు తెచ్చిపెట్టింది.

ఎన్నికల ముందు రైతు బంధు నిధులు జమ చేయాయడానికి ఈసీ అనుమతి ఇచ్చినప్పటికి ఊహించని విధంగా అనుమతిని వెనక్కి తీసుకుంది. రైతు బంధు నిధులు ఇప్పుడు జమ చేస్తే ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని భావించిన ఎన్నికల కమిషన్ రైతుబంధుకు బ్రేక్ వేసింది. ఈ పరిణామం బీఆర్ఎస్ గట్టి దెబ్బే. అయితే రైతు బంధు ఆగిపోయినప్పటికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు విడుదల చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కానీ అటు వైపు బీఆర్ఎస్ చెబుతున్న దాని ప్రకారం పిఎం కిసాన్ నిధుల విడుదల జరిగినప్పుడు రైతు బంధును మాత్రమే ఎందుకు అపుతున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే కాంగ్రెస్ బీజేపీ పార్టీలు కుమ్మక్కు రాజకీయం బయట పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల రైతు బంధు పథకాన్ని అడ్డుకుంటామని చెప్పిన రేవంత్ రెడ్డి, మొదట అనుమతి ఇచ్చిన ఈసీ ఇప్పుడు అనుమతికి నిరాకరించడం వంటివి చూస్తే బీజేపీ కాంగ్రెస్ కలిసి రాజకీయం చేస్తున్నాయనేది బీఆర్ఎస్ పార్టీ వైపు నుండి వినిపిస్తున్న మాట. ఇకపోతే ప్రస్తుత పరిణామాలన్ని బీఆర్ఎస్ కు ప్రతికూలంగా మారుతుండడం గమనార్హం. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న విమర్శలు బీఆర్ఎస్ ను తీవ్రంగా బాధిస్తున్నాయి. ఈ విమర్శలకు చెక్ పెట్టడంలో కూడా బీఆర్ఎస్ తడబడుతునే ఉంది. ఇప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఉపయోగ పడే రైతు బంధు వంటి పథకాలకు కూడా బ్రేక్ పడడంతో బీఆర్ఎస్ కు ఇబ్బందే అనే వార్తలు గుప్పు మంటున్నాయి. మరి ఈ ప్రతికూల పరిస్థితులు బీఆర్ఎస్ కు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో వేచిచూడాల్సిందే.

# కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో బీసి కులగణన చేర్చడం హర్షణీయం

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం మేరకు హైదరాబాద్ బంజారా హిల్స్ లోని హోటల్ తాజ్ కృష్ణలో 26 తొలగించబడిన సంఘాల పోరాట కమిటీ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ మరియు అతని బృందం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది.. ఈ సందర్బంగా 26 తొలగించబడిన సంఘాల పోరాట కమిటీ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ మరియు అతని బృందం ఎన్నికల ప్రచారం లో బాగంగా కాంగ్రెస్ పార్టీ అబ్యర్తుల గెలుపుకోసం చేస్తున్న ప్రచారం గురించి రాహుల్ గాంధీ కి వివరించారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ అబ్యర్తుల గెలుపుకోసం ఆళ్ల రామకృష్ణ అతని బృందం చేస్తున్న కృషిని రాహుల్ గాంధీ అభినందించారు

వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంగార్బంగా భారతదేశంలో కుల గణన కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన మొదటి వ్యక్తిగా ఆళ్ల రామకృష్ణ తనను తాను పరిచయం చేసుకున్నారు. 1414/2021 మరియు కుల గణన సమస్యపై ఇటీవలి పరిణామాలను రాహుల్ గాంధీ కి వివరించారు. అలాగే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కుల గణన అంశాన్ని చేర్చినందుకు రాహుల్‌జీని అభినందించారు

మరియు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 26 బీసీ తొలగించిన కులాలను తిరిగి చేర్చాలని అభ్యర్థించారు. ఒమోఃఆూం జాతీయ సలహాదారుగా ఆళ్ల రామకృష్ణ మరియు జాతీయ అధ్యక్షుడు గౌడ కిరణ్ కుమార్ కూడా రాహుల్‌జీని కలుసుకున్నారు మరియు అఖిల భారత స్థాయిలో విద్యార్థుల సమస్యలపై వివరణాత్మక ప్రాతినిధ్యాన్ని సమర్పించారు.

# నిలిచిపోయిన రైతుబంధు

చేయలేదని, ఎన్నికల కమిషన్ మంత్రి హరీశ్ రావు వాఖ్యలను సుమోటాగా తీసుకుని రైతు బంధు ఆపిందని కౌంటర్ ఎటాక్ చేస్తున్నారు. మంత్రి హరీశ్ రావు ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ఎదురుదాడికి దిగుతున్నారు.

### రైతన్న దెబ్బ ఎవరిమీద పడుతుందోనన్న ఆందోళనలో పార్టీలు

రెండు పార్టీలు రైతు బంధు విషయంలో ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటుంటే తమ అకౌంట్లలో డబ్బులు పడతాయని ఆశతో ఉన్న రైతాంగం మాత్రం నిరాశలో కూరుకుపోయారు. డిసెంబర్ 3 తర్వాత ఆగిన రైతు బంధు డబ్బులు మీ అకౌంట్లలో జమ చేస్తామని గులాబీ పార్టీ నేతలు, మేం గెలిస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు రైతులను తమ మాటలతో ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. అన్నీ వింటున్న రైతాంగం మాత్రం నవంబర్ 30 వ తేదీన పోలింగ్ రోజున ఎవరి దెబ్బకొడతారా అని రెండు పార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు.

# నవీన్ పట్నాయక్ వారసుడొచ్చాడు ?

అధికారిగా పేరు తెచ్చుకున్న పాండ్యన్ సంవత్సరాలుగా నవీన్ పట్నాయక్ కు నమ్మకస్తుడిగా కూడా ఉన్నారు. తాజాగా ఆయన వీఆర్ఎస్ తీసుకుని నవీన్ వ్యక్తిగత కార్యదర్శిగా మారారు. అక్కడి నుంచి బీజేడీలో చేరారు.ఈ ఏడాది అక్టోబరు 23న ప్రభుత్వ సర్వీసు నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన పాండ్యన్ ను నవీన్ ఆ తర్వాత నేరుగా తన క్రింద పనిచేయడానికి క్యాబినెట్ మంత్రి హోదాలో రాష్ట్ర ప్రధాన 5టీ–'నవీన్ ఒడిశా' పథకానికి ఛైర్మన్‌గా నియమించారు.ఇప్పుడు ఏకంగా బీజేడీలో చేరిపోవడంతో పట్నాయక్ తన పార్టీ శ్రేణులకు కీలక సందేశం పంపినట్లయింది. వాస్తవానికి బీజేడీలో నవీన్ తర్వాత ఎవరన్న సందేహాలు నెలకొన్న తరుణంలో పాండ్యన్ భవిష్యత్ ఆశాకిరణంగా మారారు.అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పాండ్యన్ బీజేడీలో చేరికను వ్యతిరేకించాయి. పట్నాయక్ ప్రభుత్వాన్ని ఒక బ్యూరోక్రాట్‌కు "అవుట్‌సోర్స్" చేశారని విమర్శించాయి. దీనికి వ్యతిరేకంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. ముఖ్యమంత్రి సన్నిహితుడిగా ఉన్న పాండ్యన్ రాజకీయ ప్రయోజనాల కోసం తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించడంతో గతంలో పలు వివాదాల్లో చిక్కుకున్నారు.

# నారా లోకేశ్ 'యువగళం' పునఃప్రారంభం

విసిరారు. వైసీపీ నేతలు అన్న క్యాంటీన్లపైనా కేసులు పెడతారని, ఏం చేసినా వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు.

### సుదీర్ఘ విరామం అనంతరం

దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ విరామం అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర సోమవారం నుంచి పునఃప్రారంభమైంది. స్కిల్ డెవలప్మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో పాదయాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడగా, దాదాపు 79 రోజుల విరామం అనంతరం ఎక్కడ ఆపేశారో అక్కడి నుంచే లోకేశ్ పాదయాత్ర మొదలుపెట్టారు. ఉదయం 10:19 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొదలాడ నుంచి 'యువగళం' ప్రారంభించారు. ఈ క్రమంలో టీడీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. పాదయాత్రలో భాగంగా పి.గన్నవరం పరిధిలో గెయిల్, ఓఎన్జీసీ బాధితులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. సెప్టెంబరు 8న ప.గో జిల్లా నుంచి ఉమ్మడి తూ.గో జిల్లాలోకి ప్రవేశించిన లోకేశ్ యాత్ర రాజోలు మీదుగా పొదలాడ చేరుకుంది. ఆ మరుసటి రోజు చంద్రబాబు అరెస్టు కావడంతో లోకేశ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. చంద్రబాబుకు ఇటీవల బెయిల్ మంజూరు కావడంతో యాత్రను మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే, ఈసారి షెడ్యూల్ మార్పు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ నగరం, కాకినాడ గ్రామీణం, పిఠాపురం, తుని నియోజకవర్గాల మీదుగా యాత్ర సాగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రోజుకు 15 కి.మీ. నుంచి 20 కి.మీ. మేర పాదయాత్ర, మధ్యలో బహిరంగ సభలు, స్థానికులతో ముఖాముఖి నిర్వహిస్తూ లోకేశ్ ముందుకు సాగనున్నారు.

# సైలెన్స్ పీరియడ్‌లో బల్క్ ఎస్ఎంఎస్ లపై నిషేధం

పంపరాదని ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కు 48 గంటల ముందు అనగా నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి 30 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్ లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ ప్రసారాలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేయవలసిందిగా ఆదేశించిందని అన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అసెంబ్లీ ఎన్నికల పోటీలో అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలను ఉల్లంఘించేలా అభ్యంతరకరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపరాదని తెలిపారు. అభ్యంతరమైన ఎస్ఎంఎస్ లను పంపినట్లయితే వారిపై విచారణ జరిపి భారత శిక్ష స్మృతి (ఐపీసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961 ప్రకారం పంపిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎస్ఎంఎస్ లు పంపడానికి అయ్యే ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 48 గంటల నిశ్శబ్ద వ్యవధిలో రాజకీయ స్వభావం గల ఎస్ఎంఎస్ ప్రచారాలను నిషేధించాలని, అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఈ ఆదేశాలపై అప్రమత్తంగా ఉంటూ నిశ్శబ్ద సమయంలో పోలింగ్ ముగిసేంతవరకు సంక్షిప్త సందేశాలను పంపరాదని పేర్కొన్నారు.

# రాయి ఏదో రత్నమేదో చూసి ఓటెయ్యండి

ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ కు మళ్లీ అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలు

1956లో ఉన్న తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ మండిపడ్డారు. 2004లో కాంగ్రెస్ తో బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) పొత్తు పెట్టుకుంటే నాడు, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని, 2005లో తెలంగాణ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆ తర్వాత ఉద్యమం చేసి 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని పోరాడితే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని అన్నారు. 'మంచివాళ్లకు ఓటేస్తే మంచి ప్రభుత్వం వస్తుంది. ఇప్పుడు అధికారం ఇస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అప్పట్లో ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలు తప్ప ఏమీ లేదు. పదేళ్ల క్రితం తెలంగాణ ఎట్లుంది, ఇప్పుడు ఎట్లుంది.?' అనేది ప్రజలు గమనించాలని చెప్పారు. నేడు తెలంగాణ అనేక రంగాల్లో అగ్రస్థానంలో ఉందని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ నే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### వారికి ఒకే విడతలో దళిత బంధు

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే విడతలో చేవెళ్లకు దళితబంధు మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు రైతు బంధు ఆపాలని గత నెలలో ఈసీకి ఫిర్యాదు చేశారని చెప్పారు. తన విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 28న రైతుబంధు నిధులు విడుదల చేసేందుకు అనుమతించిందని పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్ నేతలు మళ్లీ ఫిర్యాదు చేయడంతోనే అనుమతి వెనక్కు తీసుకున్నారని వివరించారు. ఏది ఏమైనా, డిసెంబర్ 3 తర్వాత బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని స్పష్టం చేశారు. 'రైతుబంధు నిలిపేస్తే కాంగ్రెస్ కు ఓట్లు వస్తాయని భావిస్తున్నారు. రైతులు ఈ విషయాన్ని ఆలోచించాలి. రైతుబంధు కొత్తగా ఇచ్చింది కాదు. ఇప్పటికే ఆరుసార్లు ఇచ్చాం.' అని పేర్కొన్నారు. తాను బతికున్నంత వరకూ రైతుబంధు ఆగదని పునరుద్ఘాటించారు. షాద్ నగర్ వరకు మెట్రో రైలు విస్తరిస్తామని చెప్పారు. చేవెళ్లలో 111జీవో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం నోటీసులు

వెల్లడించింది. ప్రకటన కోసం కర్ణాటక ప్రభుత్వం కనీసం దరఖాస్తు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, గత కొద్ది రోజులుగా తెలంగాణలో కర్ణాటక ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రకటనలు వస్తున్నాయంటూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి.ఇంగ్లీష్, స్థానిక మీడియా సంస్థలకు కర్ణాటక ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈసీకి ఫిర్యాదు చేశారు. కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్, పార్టీ నేతలు సుధాన్షు త్రివేది, ఓం పాఠక్‌లతో కూడిన బృందం ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నియమావళిని కాంగ్రెస్ పార్టీ ఉల్లంఘించిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం గత కొన్ని రోజులుగా తెలంగాణకు చెందిన ఇంగ్లీష్, ప్రాంతీయ మాధ్యమాల్లో ప్రకటనలు ప్రచురిస్తోందన్నారు.

# హైదరాబాద్‌లో మోడీ మెగా రోడ్ షో

బీజేపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీని చూసేందుకు భారీగా తరలివచ్చిన మహిళలు మంగళ హారతులు పట్టారు. మోడీపై పూలవర్షం కురిపించారు. దీంతో ఆర్టీసీ క్రాస్రోడ్నుంచి కాచిగూడ వరకు పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి. రోడ్ షోను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ముందుగానే ఆ రూట్లలో బస్సులను డైవర్ట్ చేసింది. ట్రాఫిక్ పోలీసులు రోడ్ షోకు 2 గంటల ముందుగానే ట్రాఫిక్ నిలిపివేశారు. హైదరాబాద్ కి ధన్యవాదాలు!నన్ను ఈ నగరం ఎల్లప్పుడూ చాలా స్నేహపూర్వకంగా స్వాగతించింది, ఈ రోజు దానికి మినహాయింపు కాదు. ఈరోజు రోడ్‌షోకి వచ్చిన అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు అని ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, భద్రతా కారణాల దృష్ట్యా చిక్కడపల్లి, నారాయణగూడ, కాచిగూడ స్టేషన్లలో మెట్రో రైలు ఆగదని మెట్రో అధికారులు ముందుగానే ప్రకటించారు. ఈ కార్యక్రమంతో తెలంగాణలో ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం ముగిసింది. రోడ్ షో అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ అమీర్‌పేటలోని గురుద్వారాను సందర్శించారు. గురునానక్ జయంతి కావడంతో ప్రధాని మోడీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురుద్వారా ప్రముఖులు ప్రధాని మోడీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానికి వారు ఖడ్గాన్ని సమర్పించారు. కాసేపు అక్కడే కూర్చుని అక్కడివారితో ముచ్చటించారు.అంతకు ముందుగా తెలంగాణ సీఎం కేసీఆర్ కు మూఢ నమ్మకాలు ఎక్కువ అని, అందుకే సచివాలయం కూల్చేశారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. అంధ విశ్వాసాలతో ప్రజాధనం వృథా చేసిన ఘనుడు కేసీఆర్ అన్నారు. తన నమ్మకాల కోసం ప్రజా ధనం వృథా చేసి సెక్రటేరియట్ కూల్చివేసిన సీఎం కేసీఆర్ మనకు అవసరమా అని మోదీ ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పసభలో పాల్గొన్న మోదీ మాట్లాడతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్ పై విమర్శలు చేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్ కు ట్రైలర్ చూపించారని, అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం సినిమా చూపిస్తారంటూ సెటైర్లు వేశారు. తెలంగాణలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతోందని, అవినీతిపరులను కచ్చితంగా జైలుకు పంపిస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణను నాశనం చేశాయని, బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ తమతో దోస్తీ కోసం ప్రయత్నించారని, అందులో భాగంగా గతంలో కేసీఆర్ దిల్లీకి వచ్చి బీజేపీతో కలిసి పనిచేస్తామని అడిగినట్లు మరోసారి ప్రధాని ప్రస్తావించారు. అయితే తన కుమారుడు మంత్రి కేటీఆర్ ను తెలంగాణకు సీఎంగా చేయాలని కోరగా.. కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించడంతో తమపై విమర్శలు మొదలుపెట్టారని పేర్కొన్నారు.కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ఎండగట్టారు. ప్రధాని మోదీ పదే పదే తెలుగులో మాట్లాడుతూ, తెలుగు పదాలు చెబుతూ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా కేసీఆర్ కుటుంబపాలనతో ఏ లక్ష్యాలు నెరవేరలేదని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలకు బదులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నీళ్లు, మోసాలు, నిరుద్యోగాలతో అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ మీద పన్ను తగ్గించాం. కానీ తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో పెట్రోల్ మీద పన్ను తగ్గించలేదన్నారు. తద్వారా ప్రజల మీద భారం పడిందని, కేసీఆర్ పాలనకు ఇది నిదర్శనం అన్నారు. ఇప్పటికే పదేళ్లు గడిచిపోయాయని, వచ్చే ఐదేళ్లు తెలంగాణ ప్రజల భవిష్యత్ కు చాలా కీలకమన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తపన పడుతున్నారని, వారి కలలు సాకారం కావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధి కోరుకుంటే కమలం గుర్తుకు మీ ఓటు వేయాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబపార్టీలు అని, వారి వల్ల కేవలం ఒకట్రెండు కుటుంబాలు బాగుపడతాయని, రాష్ట్రంలోని అన్ని వర్గాలవారికి అన్యాయం జరుగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిస్తే పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలకు ఊతం వస్తుందని, కనుక ప్రజలు ఆలోచించి ఓటు వేసి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని ప్రజలకు సూచించారు.

# జగన్ విన్నింగ్ ఫార్ములా.. ఆపరేషన్ అపోజీషన్

ఉన్నాయి. పొత్తులో భాగంగా జనసేన, బీజేపీకి దాదాపు 40–45 సీట్లు కేటాయించాల్సిన పరిస్థితులు ఉంటాయని అది వైసీపీతో హోరా హోరీగా జరిగే పోరులో తమకు నష్టం చేస్తుందనేది టీడీపీ నేతల అంచనా. అదే సమయంలో అసలు బీజేపీ కలిసి వస్తుందా లేదా అనేది ఇంకా అధికారికంగా స్పష్టత రాలేదు. చంద్రబాబు అరెస్ట్ తరువాత బీజేపీ ఢిల్లీ నాయకత్వం గుంభనంగా వ్యవహరిస్తోంది. తెలంగాణలో టీడీపీ కేడర్ కాంగ్రెస్ కు సహకరిస్తున్న అంశం బీజేపీ పైన ప్రభావం చూపించే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి.

### జగన్ టార్గెట్ అపోజీషన్

ఇక, ఇటు చంద్రబాబు కేసుల చక్రబంధంలో చిక్కుకున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగు నెలలే సమయం ఉంది. పొత్తులు, సీట్లు మేనిఫెస్టో, సర్దుబాట్లు..అన్ని వ్యవహారాలను చక్కదిద్దుకోవాల్సిన వేళ కేసులు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. అటు జగన్ అభ్యర్దుల కసరత్తు చివరి దశకు చేరినట్లు తెలుస్తోంది. బీజేపీ ఏపీలో వేసే అడుగులు పైన తమకు క్లియర్ సమాచారం ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు. సంక్షేమం చుట్టూ అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు తిరుగుతున్న వేళ ఏపీలో ఇదే సంక్షేమ ఓట్ బ్యాంక్ అదే పాజిటివ్ ఓటింగ్ నమ్ముకున్న జగన్ ప్రతిపక్షాల పైన పై చేయి సాధించారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా వచ్చే మూడు నెలల కాలంలో సంక్షేమ క్యాలెండర్ ను ఇప్పటికే ప్రకటించారు. పూర్తి స్థాయిలో ఆపరేషన్ అపోజీషన్ ద్వారా ఆత్మరక్షణలోకి నెట్టేలా జగన్ వ్యూహాలు సిద్దం చేస్తున్నారు. ప్రజల్లో ఇప్పటికే వైసీపీ నేతలు ఉండగా టీడీపీ, జనసేన అసలు ఎన్నికల సంసిద్ధత ప్రారంభించలేదు. దీంతో..జగన్ తాను నమ్ముకున్న విన్నింగ్ ఫార్ములాతో ముందుకు వెళ్తున్నారు.

# ప్రజలకు సేవ చేసే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదు

అమ్ముడుపోయే వారము కాదని ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ జాతీయ నేత ప్రియాంకా గాంధీ అన్నారు. భువనగిరి, కొడంగల్ లో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ గత 10 ఏళ్ళలో ప్రజలు రోజు రోజుకు పేదలవ్వగా, బీఆర్ఎస్ పార్టీ మాత్రం అందినంత దోచుకుందని విమర్శించారు. తెలంగాణా ప్రజలకు సేవ చేసే ఆలోచన కేసీఆర్ కు లేదని అన్నారు. ఉద్యమకారుల పోరాటం వల్ల తెలంగాణా వచ్చిందని, కేసీఆర్ వల్ల కాదని, తెలంగాణా ప్రజల ఆలోచనలను, త్యాగాలను గుర్తించి సోనియా గాంధీ తెలంగాణా ఇచ్చారని అన్నారు. అలాగే 10 ఏళ్ళలో బిజెపి ప్రపంచంలోనే అతి పెద్ద సంపన్న పార్టీగా అవతరించిందని బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపద దోచి పెట్టిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ వచ్చే 5 ఏళ్ళలో 6 గ్యారెంటీలను అమలు చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి తిరిగి వస్తే దొరల పాలన, లిక్కర్ మాఫియా వీర విహారం చేస్తాయని ప్రియాంకా గాంధీ హెచ్చరించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించవని, ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగుతుందని, అవినీతి పెరుగుతుందని ప్రియాంకా గాంధీ అన్నారు. అనేక మంది త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆమె అన్నారు. యువత ఆకాంక్షలను బీఆర్ఎస్ ప్రభుత్వం నేరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రజలు ఆశించే హామీలు అన్నీ నేరవేరుస్తామని ప్రియాంకా గాంధీ హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చి పదేళ్ళు అయ్యిందని, పదేళ్లుగా కేసీఆర్ పనితీరు కాంగ్రెస్ గమనిస్తూనే ఉందన్నారు. రైతుల అప్పులు మాఫీ చెయ్యటానికి మోడీ దగ్గర డబ్బులు ఉండవు కానీ మోడీకి రెండు విమానాలు కొనటానికి డబ్బులు ఉంటాయని ఆరోపించారు. ప్రజలకు సేవ చెయ్యటం తమకు తెలిసిన ధర్మం అన్నారు. దొరల తెలంగాణా రోజురోజుకీ బలపడుతుందని, దొరల పాలన నుండి తెలంగాణాకు విముక్తి కల్పించాలని అన్నారు

# శివనామ స్మరణతో మారుమోగుతున్న శివాలయాలు



**హైదరాబాద్** : శివనామ స్మరణతో శివాలయాలు మారుమోగుతున్నాయి. కార్తిక పౌర్ణమి కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో దీపారధన చేస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగుతున్నది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం పడుతున్నది.కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో శ్రీశైలం క్షేత్రానికి భక్తులు పోటెత్తాయి. మధ్యాహ్నం వరకు పౌర్ణమి ఉండటంతో పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గంగాధర మండపం, ఉత్తర శివమాఢ వీధిలో కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి అలంకార దర్శనానికి అధికారులు అనుమతిస్తున్నారు. దీంతో మల్లికార్జుని దర్శనానికి 4 గంటల సమయం పడుతున్నది.

# చొప్పదండిలో "హస్తం" హవా



**జగిత్యాల** చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్లు ఒక్కసారి గెలిచిన అభ్యర్తిని మరోసారి అవకాశం ఇవ్వకుండా మారుస్తూ విలక్షణమైన తీర్పు ఇస్తూ మార్పు కోరుతారు.అసెంబ్లీ ఎన్నికల తేదీ గడువు సమిపిస్తున్న కొద్ది చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెసు పార్టీ ప్రచారంలో దూసుకు పోతూ రోజు, రోజుకు గ్రాఫ్ పెంచుకుంటుంది. ఇప్పటికే నియోజక వర్గం పరిధిలోని చొప్పదండి, రామడుగు, గంగాధర, బోయినిపెల్లి, మాల్యాల, కోడిమ్యాల మండలాల్లోని మండల కేంద్రాలు, మారుమూల పల్లెల్లో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం పర్యటించగా ప్రజలు,ముఖ్యంగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలుకి వీర తిలకం దిద్దుతూ అక్కున చేర్చుకుంటూ సత్యం అన్నను గెలిపించుకుంటామని భరోసా ఇస్తున్నారు . గడపగడపకు వెళ్లి ప్రజలను కలుస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి సత్యం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అభయహస్తం గురించి ఓటర్లకు వివరిస్తూ ఆశీర్వాదం తీసుకుంటున్నారు. సత్యం ప్రచారానికి గ్రామాల్లో మహిళలు, పిల్లా పాపలతో భారీగా తరలివచ్చి బోనాలతో స్వాగతం పలికారు. గడిచిన పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రవిశంకర్ ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చలేదంటూ విమర్శిస్తూ నాకు అవకాశం ఇస్తే సంక్షేమ పథకాలు , నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చెబుతూ ప్రచారంలో ఇతర పార్టీల అభ్యర్థుల కంటే వేగంగా దూసుకుపోతున్నారు. 10 ఏళ్ళల్లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ,బి ఆర్ ఎస్ఎమ్మెల్యే, నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోకనీడంటూ ఓటర్లకు వివరిస్తూ తెలంగాణా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని సత్యం కోరుతున్నారు. ఎమ్మెల్యేపై మళ్ళీ జాలి చూపించినట్లయితే మీరే గోస పడుతారని చెబుతూ, ఓడినా, గెలిచినా చొప్పదండి ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని సత్యం వివరిస్తు ఈసారి ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు . రైతులు, యువకులు, మహిళలు, నిరుద్యోగులు, బీసీ, మైనార్టీ, ఎస్టీ, వర్గాలకు సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇస్తూ ప్రతీ దళిత కుటుంబంలో దళిత బంధు వెలుగులు నింపుతామని చెబుతూ సత్యం ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని, విద్య, వైద్యం, ఇళ్ళు లేని పేదవారికి ఇళ్ళు,అర్హులందరికీ పింఛన్లు, కొత్తగాచేస్తున్న బీడీ కార్మికులకు పింఛన్లు, మహిళలకు 2500 ఆర్థిక భరోసా, వరికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 బోనస్ , ఇంటికి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కే సిలిండర్ , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం 5 లక్షల సాయం, ఆరోగ్య భీమా వంటి పథకాలు కాంగ్రెసు అధికారంలోకి రాగానే అమలు చేస్తామన సత్యం చెబుతూ ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలనుండి సత్యం ఆశీర్వాదం తీసుకుంటున్నారు. కాంగ్రెసు పార్టీ ఆరు గ్యారంటీలు అన్ని వర్గాలకు లబ్ది చేకురెవిధంగా ఉన్నాయని ,కాంగ్రెసు పార్టీతోనే తెలంగాణా అభివృద్ధి చెందుతుందనీటు ఓటర్లను కోరుతున్నారు.

బిఆర్ ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని వాటిని నమ్మకండని,మీ వాడిగా, కుటుంబ సభ్యునిగా భావించి చేతి గుర్తుకు ఓటువేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపిస్తే మీకు అందగా ఉంటానని కాంగ్రెసు అభ్యర్థి మేడిపల్లి సత్యం ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి



**కోరుట్ల** కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ సమక్షంలో సోమవారం నాడు మెట్ పల్లిలోని పార్టీ కార్యాలయంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి బిఆర్ఎస్ పార్టీలో చేరారు . తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితుడినై బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు . కోరుట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ గెలుపునకు తాను శాయశక్తులా కృషి చేస్తానని శేర్ నర్సారెడ్డి తెలిపారు

# జిల్లాలో పకడ్బందిగా పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు రాష్ట్ర శాసనసభకు ఈ నెల 30 న జరుగనున్న సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవిఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్ లకు పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం ఆనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్ లో భాగస్వామ్యం చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు..ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు.

పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు ఈ.వి.ఎం. యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని అన్నారు.

పోలింగ్ రోజు పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.ప్రతీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎపిక్ కార్డుల పంపిణీ బూత్ స్థాయి అధికారులతో వెంటనే పూర్తిచేయాలని, రిజిస్టర్ లో ఏకనాలేదేమెంట్ తీసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తిచేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, రిటర్నింగ్ అధికారులు నరసింహ మూర్తి, రాజేశ్వర్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నెత్తుటితో తడిచిన దేహం

## – కాంతారా ప్రీక్వెల్ ప్రారంభం

రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'కాంతార' ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించింది. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. గతేడాది విడుదలైన ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా ఓ సినిమా సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. సోమవారం ఈ చిత్రం టైటిల్ విడుదల చేశారు. 'కాంతార ఏ లెజెండ్' అనే పేరుతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'కదంబాల పాలన సమయంలో ఒక లెజెండ్ జన్మించాడు' అంటూ రిషబ్ లుక్‌ను రివీల్ చేశారు. నెత్తుటితో తడిచిన దేహం, ఆవేశం నిండిన చూపు, పొడవాటి జుట్టుతో రిషబ్ లుక్ వెన్నులో వణుకు పుట్టించేలా ఉంది.

ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2022లో విడుదల అయిన 'కాంతార' ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. రూ. 15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా రూ. 400 కోట్ల వసూళ్లను సాధించింది. కర్ణాటకలో 'కేజీయఫ్: ఛాప్టర్ 2'ని మించిన వసూళ్లను సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు దీని రెండో భాగాన్ని 'కాంతార: ఛాప్టర్ 1' పేరిట తెరకెక్కిస్తున్నారు.

మొదటి భాగానికి ప్రీక్వెల్‌గా ఈ సినిమా రానుంది. ఈ సినిమా రూ. 1000 కోట్ల వసూళ్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉంది. ఏడు భాషల్లో ఈ సినిమాని మేకర్స్ విడుదల చేయనున్నారు. కన్నడ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, ఇంగ్లిష్, బెంగాలీ భాషల్లో 'కాంతార: ఛాప్టర్ 1' రిలీజ్ కానుంది.

# సలార్ విడుదలకు సన్నాహాలు



ప్రభాస్, శృతి హాసన్ జంటగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న 'సలార్' సినిమా డిసెంబర్ 22 న విడుదలవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ముందుగా ఎన్నో విడుదల తేదీలు ప్రకటించిన తరువాత ఇప్పుడు డిసెంబర్ 22తేదీ ఖరారు చేశారు. ఇందులో నటించిన ప్రభాస్ కూడా ఈమధ్యనే హైదరాబాదు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రచారాలు డిసెంబర్ మొదటి వారం నుండి మొదలు పెట్టనున్నారని తెలుస్తోంది. ఈ సినిమా ట్రైలర్ కూడా డిసెంబర్ 1వ తేదీన సాయంత్రం విడుదల చేస్తున్నారు. అయితే ఈలోపు 'సలార్' సినిమా సెన్సారు కార్యక్రమాలకి సన్నాహాలు చేస్తున్నట్టుగా పరిశ్రమలో టాక్ నడుస్తోంది. అందుకోసమనే ఇందులో పనిచేసిన ఆర్టిస్టులు చేత డబ్బింగ్ చెప్పించే పనిలో చిత్ర నిర్వాహకులు వున్నారని తెలిసింది. ఒకటిరెండు రోజుల్లో 'సలార్' సెన్సార్ అయ్యే సూచనలు వున్నాయని చెపుతున్నారు. ప్రముఖ మలయాళం నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారని కూడా తెలుస్తోంది. ఇప్పుడు సెన్సార్ విషయాలు కూడా చాలా కఠినతరం చేశారు అని తెలుస్తోంది. ఆమధ్య నటుడు విశాల్ సినిమాల సెన్సార్ విషయంలో చాలా అవినీతి చోటుచేసుకుంటోంది అని ఆరోపణ చెయ్యడం, ఆ తరువాత దానిమీద చాలా తీవ్రమైన చర్చలు జరిగిన విషయం కూడా తెలిసిందే. ఆ సంఘటన జరిగిన దగ్గర నుంచి ఈ సినిమా అయినా సెన్సార్ సభ్యులు చూసినప్పుడు అక్కడికి ఎవరినీ అనుమతించేది లేదని అందుకని 'సలార్' సెన్సారు జరిగేటప్పుడు కూడా టాక్ అసలు బయటకి రాదని తెలుస్తోంది.

# మమ్ముట్టి ..నటన అపూర్వం అన్న సమంత



టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత ప్రస్తుతం సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చారు. మయోసైటిస్‌తో బాధ పడుతున్న ఆమె ట్రీట్‌మెంట్ తీసుకోవడం కోసం విదేశాలకు వెళ్లొచ్చారు. ప్రస్తుతం వర్క్ ఒత్తిడికి కాస్త దూరంగా ఉంటూ రిలాక్స్ అవుతున్నారు. అయితే తన డైలీ రొటీన మాత్రం ఏమీ మారలేదు. జిమ్‌లో వర్కవుట్స్ యధావిధిగా చేస్తోంది. తనకు సంబంధించిన అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలతోపాటు.. తాను చూసిన చిత్రాల రివ్యూలను అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా మమ్ముట్టి–జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటించిన 'కాథల్–ది కోర్‌పై ఆమె స్పందించారు. 'కాథల్–ది కోర్' అత్యద్భుతంగా ఉంది. ఈ ఏడాదిలో చూసిన ఉత్తమ చిత్రం ఇదే! అందరూ చూడాల్సిన శక్తిమంతమైన సినిమా. మమ్ముట్టి నా హీరో. ఇందులో ఆయన నటన ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమా చూశాక పొందిన అనుభూతి నుంచి ఇప్పటికీ బయటకు రాలేకపోతున్నా. మంచి సినిమా చూస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. లవ్యూ జ్యోతిక' అని ఇన్ స్టాగ్రామ్ స్టాటస్‌లో షేర్ చేశారు. దర్శకుడు జియోబాబీని లెజెండ్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. సమంతకు కృతజ్ఞతలు అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.




# నితిన్.. ఎక్స్ట్రార్డినరీ మ్యాన్



టాలీవుడ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్. నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా ఫేమ్ వక్కంతం వంశీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా.. సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అయితే రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న హీరో నితిన్ యాక్షన్ మాస్ జోనర్ సినిమాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఊర మాస్ సినిమాలు సెట్ కావనే విషయంలో క్లారిటీ వచ్చేసిందని నితిన్ తెలిపాడు. ఇకపై ఊర మాస్, యాక్షన్ లాంటి కథలతో వచ్చే సినిమాలు చేయనని ఫన్, కమర్షియల్ అంశాలతో కూడిన సినిమాలు చేయాలని ఫిక్స్ అయినట్లు వెల్లడించాడు. దీంతో నితిన్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవులున్నాయి. ఇక జూనియర్ ఆర్టిస్ట్ ప్రేమకథతో వస్తున్న ఈ చిత్రాన్ని నితిన్ హోం బ్యానర్ శ్రేష్ఠ్ మూవీస్‌పై సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. హరీష్ జయరాజ్ సంగీతమందిస్తున్నారు.




# రష్మికతో ప్రేమయాణంలో విజయ్ దేవరకొండ



యంగ్ హీరో విజయ్ దేవరకొండ గత కొంత కాలంగా నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. సినిమాలతో పాటు వ్యక్తిగత విషయాలతోనూ ట్రెండ్ అవుతున్నారు. రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ ప్రేమాయణం గురించి బాగా వార్తలు వినిపిస్తున్నాయి.

రష్మిక కొంత కాలంగా విజయ్ ఇంట్లోనే ఉంటుందనే టాక్ నడుస్తోంది. విజయ్, రష్మిక పెట్టే ఫోటోలను నెటిజన్లు బూతద్దం వేసి మరీ వెతుకుతున్నారు. ఏదైనా కొత్త విషయం దొరకకపోదా అని ఆరా తీస్తున్నారు. 'పెళ్లి చూపులు' సినిమాతో తెలుగు తెరకు హీరోగా పరిచయం అయిన విజయ్, 'అర్జున్ రెడ్డి' సినిమాతో బాగా పాపులర్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన 'గీత గోవిందం' సినిమా కూడా సంచలన విజయం సాధించడంతో ఆయన కెరీర్ మరింత స్వింగ్ లోకి వచ్చింది. 'టాక్సీ వాలా' ఫర్వాలేదు అనిపించినా, పూరి జగన్నాథ్ పాన్ ఇండియా రేంజిలో తెరకెక్కించి 'లైగర్' సినిమా మాత్రం బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ గా మిగిలింది. విజయ్ కెరీర్ కే పెద్ద మచ్చగా మిగిలిపోయింది. తాజాగా ఆయన నటించి 'ఖుషి' సినిమా కూడా ప్రేక్షకులను అంతంత మాత్రంగానే ఆకట్టుకుంది. ప్రస్తుతం 'ఫ్యామిలీ స్టార్' అనే సినిమా చేస్తున్నారు.

# పథకమేదైనా దందాల తలసాని

## - 9 విషయాల ప్రస్తావన - ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పై కాంగ్రెస్ ఛార్జ్ షీట్






**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పై కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన చార్జి షీట్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆయన చేసిన అవినీతి, అక్రమాలను తెలుగులోకి తీసుకురావడంతో సనత్ నగర్ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఓ మంత్రి ఇన్ని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు అంటే ఇంకా తెర వెనక ఎన్ని అవినీతి అక్రమాల దందాలు ఉన్నాయో అంటూ ఆరోపిస్తున్నారు. ఈ ఛార్జ్ షీట్ తలసాని శ్రీనివాస్ ఓటమికి నాంది పలుకుతుందని కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తలసాని అక్రమాస్తులపై ఆయన అవినీతి దందాలపై పూర్తిస్థాయి విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు ప్రస్తావిస్తున్నారు.

1. తలసాని సాయికిరణ్ యాదవ్, అతని స్నేహితులు 2022లో హెూలీ వేడుకల సందర్భంగా టీవీ నటి సురేఖా వాణి కుమార్తె సుప్రితపై లైంగిక వేధింపులకు పాల్పడ్డరు. దీనిపై రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ లో సురేఖా వాణి ఎఫ్ఐఆర్ నమోదు చేయించగా మంత్రి వాళ్లను బెదిరించి తన కొడుకు దుశ్చర్యను బయటకు రాకుండా సెటిల్ చేసిండు.

2. మంత్రి కొడుకు అరాచకాలకు అడ్డు, అదుపు లేకుండా పోయింది. 2021 నవంబర్ లో సాయికిరణ్ యాదవ్ ఖైరతాబాద్ లోని సదర్ ఉత్సవాల నుండి తిరిగి వస్తుండగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తన కారును బాధితుడి కాలుపైకి ఎక్కించిండు. దీని గురించి పిర్యాదు చేస్తే చంపేస్తానని బాధితుడిని బెదిరించిండు.

3. కెమికల్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నందున హైదరాబాద్ వ్యాప్తంగా సనత్ నగర్ అత్యంత కలుషిత ప్రాంతంగా తయారైంది. దీని కారణంగా కంపెనీలు నెలవారీ కమీషన్లు ఇవ్వాలని, లేనిపక్షంలో వ్యాపారాలు సక్రమంగా జరగనివ్వనని మంత్రి హుకుం జారీ చేసిండు.

4. వీధి దీపాల నిర్వహణ, రోడ్లపై గుంతలు, చెత్త తొలగింపు లాంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. మురుగునీటి వలన తీవ్రమైన పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నయ్. ఈ విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నడు.

5. నియోజకవర్గంతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యే క్వార్టర్స్, మల్లాపూర్, గచ్చిబౌలి చుట్టుపక్కల విల్లాలు, అపార్టుమెంట్లలో మంత్రి ఆయన సోదరులు క్యాసినో, గ్యాంబ్లింగ్ లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నరు. ఎవరైనా ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే వారిని బెదిరిస్తుండ్లు.

6. నియోజకవర్గంలో మంత్రి, ఆయన సోదరులు రౌడీ దర్బార్ నడుపుతున్నారు. మంత్రి సోదరుడు మహేందర్ యాదవ్ కూన వెంకటేశ్ పై, మంత్రి బంధువు శ్రీనుయాదవ్, అతని అనుచరులు అంబర్ పేట సర్కిల్ హౌస్ లోని జీహెచ్ఎంసీ ఉద్యోగి ఎన్ . సాయికుమార్ పై దాడి చేసింద్రు.

7. మంత్రి, ఆయన సోదరులు తలసాని ధర్మేంద్ర, తలసాని మహేష్ యాదవ్ ల ద్వారా 2019లో మనీలాండరింగ్ లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డడు. సనత్ నగర్ బ్రిడ్జి పరిధిలో తమ అనుచరుల ద్వారా గంజాయి మాఫియాను నడుపుతూ భారీ లావాదేవీలు నిర్వహించి కోట్లు కొల్లగొట్టింద్రు.

8. ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండకుండా మారేడ్పల్లి లోని తన బంగ్లాలో సేదతీరుతూ కాలక్షేపం చేస్తున్నడు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆయన బంగ్లాకు వెళ్లి గంటలు తరబడి బయటే వేచి చూసినా ఎమ్మెల్యేకు చీమకుట్టినట్లైనా లేదు. 9. తలసాని శ్రీనివాస్ యాదవ్ పై తిరగబడదాం. సనత్ నగర్ నియోజకవర్గాన్ని కాపాడు కుందాం..ఈ విధంగా 9 అంశాలతో తలసానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన చార్జిషీట్ లో సనత్ నగర్ ను కాపాడుకుందాం అంటూ విడుదల చేశారు. దీనిపై సనత్ నగర్ నియోజకవర్గ ప్రజల స్పందన డిసెంబర్ 3వ తేదీ నాడు తేలుతుంది.

### తలసాని చార్జిషీట్ పై ప్రజలు ఆగ్రహం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పై కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన చార్జీ షీట్ చదివి ప్రజలు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎమ్మెల్యే ఇన్ సైడర్ ట్రేడింగ్ కు పాల్పడి నెక్లెస్ రోడ్డులోని థ్రిల్ సిటీ ప్రాజెక్టును 99 ఏళ్ల లీజుకు తన కుమారుడు సాయికిరణ్ యాదవ్ కు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కట్టబెట్టిండు. ఆ ప్రాజెక్ట్ ద్వారా కోట్లు కొల్లగొట్టేందుకు పథకం పన్నారు. సినీనటి సురేఖ వాణి కూతురు సుప్రియ పై తలసాని కుమారుడు తలసాని సాయి కిరణ్ లైంగిక వేధింపులకు పాల్పడడం పై తెలంగాణ ప్రజలు గతంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ వాచ్‌పై కుట్ర

- ఉదయం 10 గంటల 44 నిమిషాల నుంచి
- మధ్యాహ్నం 2 గంటల 22 నిమిషాల వరకు బ్లాక్ చేయించిన వైనం
- పరిశోధన కథనాలతో 'తెలంగాణ వాచ్' సంచలనం
- గుండెల్లో గునపాలతో ఆగేది లేదు.. ఆపే దమ్మున్నోడు లేదు
- తీవ్రంగా ఖండించిన రేవంత్ రెడ్డి
- నిరసన వెలుబుచ్చిన సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్ట్ సంఘాల అధినేతలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎట్టకేలకు ఏం చేసినా ఆ కలం ఆగదని తెలిసిపోయింది. మరో మూడు రోజుల్లో ఇంకెన్ని 'గుట్లు' బయటకు వస్తాయోనని వారి కనుసన్నల్లో వాళ్ల దండు చేసిన అకృత్యం ఇది.

మాట్లాడే గొంతుకులను నులిమే వికృతం. "ఆగేది లేదు. ఆపే దమ్మున్నోడు లేదు" అంటూ అక్రమార్కుల గుండెల్లో గునపాలను దింపుతూ మరికొన్ని సంచలన పరిశోధన కథనాలతో 'తెలంగాణా వాచ్' ముందుకు వెళ్ళాలని సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్ట్ సంఘాల అధినేతలు ఆకాంక్షించారు.

### అసలేం జరిగిందంటే..?

పరిశోధన జర్నలిజంలో 30ఏళ్ళకు పైగా వేలాది కుంభకోణాలను అది కూడా బురిడీ బాబాల నుంచి గవర్నర్ లుగా, ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా పనిచేసిన, చేస్తున్న వారి 'చీకటి చరిత్ర'లను ఆధారాలతో బరటపెట్టిన ప్రముఖ పరిశోధన పాత్రికేయులు అనంచిన్ని వెంకటేశ్వరరావు, ఆయన అజ్ఞాత పరిశోధన బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'తెలంగాణ వాచ్'
గత ఆరున్నర సంవత్సరాల నుంచి జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ఆధారాలతో తీవ్రస్థాయిలో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

### 'కేసులు.. జైళ్ళ' ఆపలేవని..

ఏదీ ఎక్కువ కాలం దాగదు. నిజం అసలే ఆగదు. తెలంగాణలో 'తొలి ధిక్కారం' ఆయనదే. అందుకే ఎమర్జెన్సీ తర్వాత అతి ఎక్కువ రోజులు జైలు జీవితం గడిపిన తొలి 'తెలంగాణ జర్నలిస్ట్ ' కూడా ఆయనే.

### తీవ్రంగా ఖండించిన రేవంత్ రెడ్డి..

మాట్లాడే గొంతుకులను నులిమే వికృతమని, ఇది ఎన్నో రోజులు సాగవని, 'ఆత్మగౌరవం'తో ఏర్పడిన తెలంగాణలో ఈ బానిస బతుకులు వద్దని, 'తెలంగాణ వాచ్' రాసిన వార్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే విచారణ జరుగుతుందని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు.

### మేము ఉన్నాం: జర్నలిస్టు సంఘాల అధినేతలు..

'తెలంగాణ వాచ్' రాసిన కథనాలపై దమ్ముంటే విచారణ చేయాలని, అంతే తప్ప ప్రజాస్వామ్య గొంతుకలను నొక్కుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి,
తెలంగాణ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జాతీయ అధ్యక్షులు కె.కోటేశ్వర్ రావు, నామాల విశ్వేశ్వరావు, బెలిద హరినాథ్, రవికుమార్, సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు తీవ్ర స్వరంతో ప్రభుత్వాన్ని నీలదీశారు.




# బిజెపి గెలవకుండా రేవంత్ కుట్ర

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి గెలుపు అవకాశాలను దెబ్బతీయాలనే కుట్రతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కామారెడ్డికి వచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకున్నారని, ఇక్కడ బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి భారీ మెజారిటీతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గెలవబోతున్నారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, యువత, పేదలు, బీసీలు, దళితులు, రైతులు బీజేపీవైపు వున్నారని చాలా స్పష్టమవుతోందన్నారు. ఈనెల 30న జరగనున్న పోలింగ్‌లో భారతీయ జనతాపార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని కిషన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.అవినీతి, కుటుంబ పార్టీలు తెరవెనుక పన్నుతున్న కుట్రలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారని కిషన్ రెడ్డి అన్నారు. పదేళ్ళకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏం చేసిందో, అలాగే బీఆర్ఎస్ కూడా ఏంచేసిందో వాటిపై చర్చ జరపకుండా.. డబ్బులు, మద్యం పంచడం.. మజ్లిస్ పార్టీతో కలిసి బుజ్జగింపు రాజకీయలు చేస్తున్నారని ఆరోపించారు.



## రైతు నోటికాడి బుక్కను

# లాక్కున్న కాంగ్రెస్



**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్):** రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ వెంటబడి మరీ నిలిపివేయించిందని, రైతుల నోటి కాడి బుక్కను లాక్కొని ఆ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారు నిప్పులు చెరిగారు. రైతు బంధు ఇప్పటికే అమల్లో ఉన్న పథకమని, 10 సార్లు రైతు బంధ పథకం కింద రైతుల ఖాతాలో ప్రభుత్వం డబ్బు జమా చేసిందని గుర్తు చేశారు. అది ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టకున్నా ప్రవేశపెట్టిన పథకం అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటబడి రైతు బంధు పథకాన్ని ఆపించారని మండిపడ్డారు. ఈ పథకం కింద 65 లక్షల మంది రైతులకు రూ. 72 వేల కోట్ల మేర నిధులను ఇచ్చామని, దాంతో రైతులు బీఆర్ఎస్ వైపు ఉన్నారన్న అభద్రతతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు వ్యతిరేకతను చాటుకున్నారని, రైతుల నోటికాడి బుక్కను గుంజుకున్నారని నిప్పులు చెరిగారు. రైతురుణ మాఫీని ఆపిందని, రైతు వ్యతిరేక వైఖరిని కాంగ్రెస్ పార్టీ మరోసారి రుజువు చేసుకుందని స్పష్టం చేశారు. నోటికాడి బుక్కను గుంజుకుంటున్న కాంగ్రెస్ పార్టీని గుర్తుకు తెచ్చుకొని ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటేసి తగిన బుద్ధిచెప్పాలని రైతులకు పిలుపునిచ్చారు.నిజామాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత గారు మాట్లాడారు.గత ఐదారు రోజులుగా ప్రధాని, ఇతర రాష్ట్రాల సీఎంలు, కాంగ్రెస్ అగ్రనాయకులు వచ్చి ప్రచారం చేస్తున్నారని, పంటలు మంచి చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చి పంటలను ఎలా నాశనం చేస్తుందో అలా తెలంగాణ మీద పడడానికి వస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన నాడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. సకల జనల సమ్మె, పెన్ డౌన్, గన్ డౌన్ వంటి కార్యక్రమాలు చేపట్టి తండ్లాడి తెలంగాణను తెచ్చుకున్నామని, రాష్ట్రం వచ్చిన తర్వాత పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు ఆంధ్రా హక్కుల గురించి మాట్లాడారు కానీ తెలంగాణ హక్కు గురించి మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణలోని 7 మండలాలను అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఆంధ్రలో కలిపినప్పుడు, కేంద్రం విభజన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులకు మాట్లాడడానికి నోరు రాలేదని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడినప్పుడు సోనియా గాంధీ అక్కడే ఉన్నా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు.రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి తెలంగాణకు వచ్చినప్పటికీ ఇక్కడి అంశాలను ప్రస్తావించలేదని ఆక్షేపించారు. బీజేపీ ఎప్పుడూ అబద్దాలు చెప్పిందే కానీ ఒక్కసారి కూడా నిజం చెప్పలేదని, తెలంగాణలో ఉన్న శాంతిసామరస్యాలను పాడుచేయడానికి ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని తెలిపారు. ఒకరు భాగ్యలక్ష్మి దేవాలయం అంటారు... మరొకరు భైంసాకు వెళ్లి ఏదో చేస్తామంటారు తప్పా ఎప్పుడు కూడా మనకు భరోసా, భద్రత ఇచ్చేలా, మన అస్థిత్వాన్ని కాపాడడానికి ఏనాడు బీజేపీ ప్రయత్నం చేయలేదని స్పష్టం చేశారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నాయకులు, పార్లమెంటులో పెదవి విప్పని నాయకులు, అవసరమున్నప్పుడు తెలంగాణకు నయాపైసా ఇవ్వని వాళ్లు మనకు అవసరమా అన్నది ఆలోచించాలని కోరారు.మతం పేరు చెప్పి మంటలు పెట్టాలని ఒక పార్టీ చూస్తోందని, మరొక పార్టీ కులం పేరు చెప్పి కుతంత్రం చేసే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. తెలంగాణ కోసం కొట్లాడే సమయంలో ఎవరిదే కులం, మతం అని అనుకోలేదని, ఇప్పటికీ అందరం కలిసిమెలసి ఉన్నామని తెలిపారు. తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం జరిగితే ముస్లింలకు ఎంత నష్టం జరుగుతుందో హిందువులకు కూడా అంతే నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ఆలోచన లేక కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు.మంచోళ్లు కావాలా ముంచేటోళ్లు కావాలా అన్నది తేల్చుకునే సందర్భం వచ్చింది. 24 గంటల కరెంటు ఇచ్చేవాళ్లు కావాలా లేదా 3 గంటల కరెంట్ ఇచ్చేవాళ్లు కావాలా తేల్చుకునే సమయం వచ్చింది. రైతు బంధు కావాలా లేదా రాబందు కావాలా, ఇరిగేషన్ కావాలా లేదా మైగ్రేషన్ కావాలా అన్నది తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. మానవీయ కోణంతో ఆలోచించే సీఎం కేసీఆర్ పై అభాండాలు వేస్తూ, పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తూ దండయాత్రకు వచ్చిన మిడతల దండు పనిపట్టాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆధిత్యనాథ్ వచ్చి తెలంగాణలో బుల్డోజర్ నడపాల్సిన సమయం వచ్చిందని అంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు నడిపినా వాటిపై దాడి చేయడానికి కారు సిద్ధంగా ఉందని అన్నారు. "బుల్డోజర్లు నడపడం మా ఆలోచన కాదు. పోలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలన్నదే మా ఆలోచన. సాగు, తాగు నీళ్లు అందించాలన్నది, పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నది, అభివృద్ధి మా ఆలోచనలు. మీ లాగా ఇళ్లను కూల్చివేయడం మా ఆలోచన కాదు. ఇళ్లు నిర్మించడం మా ఆలోచన." అని వ్యాఖ్యానించారు. తెలంగాణ పునాదులను బలంగా వేశామని, చాలా పనులు చేశామని, ఇంకా చేయాల్సింది ఉందని తెలిపారు. ట్రైలర్ చూసి భయడుతున్నారని, తెలంగాణ మంచి ఉన్నత స్థానానికి చేరుకుంటుందని స్పష్టం చేశారు. కేవలం ట్రైలర్ చూసే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భయపడ్డాయని, సినిమా ఇంకా మిలిగే ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మూడో సారి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకం ఏ ప్రభుత్వమైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. బీజేపీతో సీఎం కేసీఆర్ చేతులు కలిపారని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తున్నదని, ఏ అంశంలో చేతులు కలిపారన్నది కాంగ్రెస్ నాయకులను అడగాలని ప్రజలను కోరారు. ట్రిపుల్ తలాక్ బిల్లు పార్లమెంటుకు వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేసిందా లేదా చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ తీసుకొచ్చిన జీఎస్టీ బిల్లుకు కాంగ్రెస్ మద్ధతివ్వలేదా ? వాట్సప్ లో బీజేపీ పార్టీ అబద్దాలను ప్రచారం చేస్తున్నదని, వాటిని నమ్మవద్దని సూచించారు.కేవలం అధికారంలోకి రావాలన్నది కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఆరాటమని, ఆ పార్టీలు పొరపాటున అధికారంలోకి వస్తే ఏ నాయకుడూ ప్రజలకు కనిపించరని అన్నారు. ఢిల్లీ నుంచి వస్తున్న నాయకులు ప్రచారం చేసుకొని తిరిగి ఢిల్లీకే వెళ్తారని, కానీ సీఎం కేసీఆర్ ఇక్కడే ఉండి ప్రజల బాగోగులు చూసుకుంటారని తెలిపారు. కాబట్టి ఎవరినో సీఎం చేయడానికి ఓటు వేయడం కాకుండా మంచి భవిష్యత్తు కోసం ఓటు వేయాలని, మంచి భవిష్యత్తు ఇచ్చే బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 55 పరిపాలించి కనీసం తాగడానికి మంచినీళ్లు, కరెంటు ఇవ్వలేకపోయిందని చెప్పారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కనిపించని శత్రువు అని, బీజేపీ బహిరంగ శత్రువు అని తేల్చిచెప్పారు. సెక్యులర్ పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు.అలాగే, నిజామాబాద్ లో కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నదని, తమ పార్టీ అభ్యర్థులపై దాడులు చేస్తోందని ధ్వజమెత్తారు. పోలీసుల పేర్లను రెడ్ డైరీలో రాస్తామని చెప్పడంతో పాటు తరతరాలుగా కాంగ్రెస్ పార్టీ చేసిన గూండాయిజాన్ని మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు

### అధికారంలోకి రాకముందే రైతునోట్లో మట్టి



పెద్దపల్లి **(ప్రశ్న న్యూస్):** అధికారంలోకి రాకముందే రైతుబంధును కాటగలిపి రైతుల నోట్లో మట్టిగొట్టారని మంత్రి కేటీఆర్ అన్నారు. పొరపాటున ఆ పార్టీలు అధికారంలో రైతుబంధును మొత్తానికే ఎత్తగొడతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కొత్త కుట్రకు తెరలెపి రైతుబంధును ఆపేశాయని విమర్శించారు. రైతుబంధు ఇవ్వొద్దని కాగ్రెస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో చాలామందికి మూడెకరాలోపే భూమి ఉన్నదని, 3 గంటల కరెంటు సరిపోతుందని.. 24 గంటల కరెంట్ ఎందుకని రేవంత్ రెడ్డి అంటున్నాడన్నారు. రైతుబంధు రైతుకిస్తే కౌలుదారుకు ఇవ్వమని, కౌలుదారుకిస్తే రైతుకిచ్చేది లేదని పీసీసీ చీఫ్ ప్రకటించాడని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కొత్తదేమీ కాదని, చెత్తపార్టీ అన్ని విమర్శించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు అడుగుతున్నారని, ఇప్పటివరకు 11 సార్లు అవకాశం ఇస్తే తాగు నీరు, సాగు నీరివ్వలేదు, కరెంటు, పెన్షన్లు ఇవ్వలే, సంక్షేమం సక్కగ చేయకుండా జీవితాలను ఆగంచేశారని విమర్శించారు. రైతులను ఆగం చేసిందని, మన బతుకులను నాశనం చేసిందని, తెలంగాణను బొందపెట్టే ప్రయత్నం చేసిన పార్టీ, 55 ఏండ్లు మన పిల్లలను సావగొట్టిన పార్టీ, తెలంగాణ ఇవ్వకుండా వందల మంది పిల్లల ప్రాణాలు తీసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588